శ్రీవారిసేవలో ప్రముఖులు

తిరుమల,ఆగస్ట్ 8ప్రభాతవార్తప్రతినిధి:
కలియుగప్రత్యక్షదైవమ్ శ్రీవేంకటేశ్వరస్వామిని గురువారం ఉదయం ప్రముఖులు దర్శించుకున్నారు. తిరుపతి నగర మేయర్ డాక్టర్ ఆర్.శిరీష, తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ,ఎమ్మెల్యే గన్నబాబు వెంకన్న సేవలో పాల్గొని తీర్థప్రసాదాలు అందుకున్నారు. బిజెపినేత భానుప్రకాష్‌రెడ్డి కూడా శ్రీవారి సేవలో పాల్గొన్నారు.

తిరుపతి జిల్లాకు సుపరిచిత అధికారులు !

డిఎస్పీలుగా కొత్త పోస్టింగ్‌లు -తిరుపతికి వెంకటనారాయణ, తిరుమలకు విజయశేఖర్

తిరుపతి,ఆగస్ట్ 8ప్రభాతవార్త:
అంతా ఊహించినట్లే రాష్ట్రంలో డిఎస్పీ స్థాయి అధికారుల బదిలీల్లో తిరుపతి జిల్లాకు సుపరిచిత అధికారులు బదిలీపై వస్తున్నారు. తిరుపతి నగర డిఎస్పీగా జొన్నలగడ్డ వెంకటనారాయణ, తిరుమల డిఎస్పీగా కె.విజయశేఖర్ పోస్టింగ్ లభించింది. తిరుపతి జిల్లాలో ఐదుమంది డిఎస్పీల బదిలీల్లో ఇద్దరు డిఎస్పీలు పాత అధికారులే పదోన్నతి పొంది డిఎస్పీ హోదాలో ఇక్కడకు కొత్తగా నియమితులయ్యారు. గతంలో ఉమ్మడి చిత్తూరుజిల్లాలో తిరుపతి ఈస్టు,సత్యవేడు, మదనపల్లి,ములకలచెరువు ఎస్ఐ,సిఐ హోదాలో వెంకటనారాయణ సమర్ధవంతంగా విధులు నిర్వహించారు. పదోన్నతిపొంది విజయవాట ట్రాఫిక్‌లో, ఎస్ఇబి డిఎస్పీగా పనిచేస్తూ ఇక్కడకు వస్తున్నారు. తిరుమల డిఎస్పీ విజయశేఖర్ పలు హోదాల్లో తిరుపతి,తిరుమలతోబాటు ఉమ్మడి చిత్తూరుజిల్లాలో, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంలో అంకితభావంతో విధులు నిర్వహించారు. కర్నూలు ట్రాఫిక్ డిఎస్పీగా బదిలీ పై వెళ్లిన ఆయన ప్రస్తుతం తిరుమలకు వస్తున్నారు. ఇద్దరు డిఎస్పీలు తిరుపతి,తిరుమలపై పూర్తిస్థాయి అవగాహన కలిగిఉన్నారు. రేణిగుంట డిఎస్పీగా వెంకటాద్రి (తిరుపతి ఎస్‌బిలోఉండి బదిలీ), టాస్క్‌ఫోర్స్ డిఎస్పీ రవికుమార్ పుత్తూరుకు,పుత్తూరులో ఉన్న శ్రీనివాసరావు సిఐడికి. గతంలో ట్రాఫిక్ డిఎస్పీగా పనిచేసిన రమణకుమార్ గూడూరు డిఎస్పీగా నియమితులయ్యారు. వీరంతా రెండు రోజుల్లో ఆయా స్థానాల్లో బాధ్యతలు చేపట్టాల్సి ఉంది.



ఆతిథ్య రంగం అభివృద్ధితో స్థానికులకు ఉపాధి మెండు

దేవ్‌లోక్‌లో ఓబెరాయ్ హోటల్ నిర్మాణ స్థల కలెక్టర్ పరిశీలన

తిరుపతి కార్పొరేషన్, ఆగస్టు 8, ప్రభాతవార్త
పర్యాటక కార్పొరేషన్ ట్రాన్స్పోర్ట్ కార్యాలయం సమీపంలోని దేవ్ లోక్ నందు ఒబెరాయ్ హోటల్ నిర్మాణానికి సంబంధించిన స్థలాన్ని పరిశీలించి జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధికి, ఆతిథ్య రంగ అభివృద్ధికి అనేక అవకాశాలు ఉన్నాయని దీని ద్వారా స్థానికులకు ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని పేర్కొన్నారు. గురువారం స్థానిక పర్యాటక కార్పొరేషన్ ట్రాన్స్పోర్ట్ ఆఫీస్ సమీపంలోని దేవ్‌లోక్ నందు ఒబెరాయ్ హోటల్ నిర్మాణానికి కేటాయించిన 20 ఎకరాల స్థలాన్ని జిల్లా కలెక్టర్ సంబంధిత రెవెన్యూ పర్యాటక శాఖ అధికారులతో కలిసి పరిశీలించి మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో తిరుమల ఏడు కొండల స్వామి వారు, జ్ఞాన ప్రసూనాంబా సమేత శ్రీ కాళహస్తీశ్వర స్వామి ఆలయం తదితర పుణ్య క్షేత్రాలు, తూపిలి పాలెం బీచ్, ఇరకం దీవులు, తలకోన తదితర అద్భుతమైన పర్యాటక ప్రదేశాలు ఉన్నాయని, తిరుపతి జిల్లా వైద్య హబ్‌గా ఉన్నత విద్యా సంస్థలు కలిగి విద్యా హబ్‌గా, పారిశ్రామిక సెజ్‌లు కలిగి పరిశ్రమల హబ్‌గా, రైల్, రోడ్డు, విమానాశ్రయ సదుపాయాలు కలిగి ఆతిథ్య రంగ అభివృద్ధికి అనేక అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ప్రతి రోజు ప్రపంచ నలుమూలల నుండి తిరుపతి జిల్లాలో సుమారు 75 వేల నుండి లక్ష మంది దాకా పర్యాటకులు, విద్యార్థులు, ప్రజలు విచ్చేస్తుంటారని ఈ నేపథ్యంలో ఒబెరాయ్ వంటి సెవన్ స్టార్, హయత్ వంటి ప్రముఖ హోటల్‌లు జిల్లాలో నెలకొల్పడం ద్వారా స్థానికులకు ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని, అలాగే ప్రభుత్వానికి రెవెన్యూ కూడా సమకూరుతుందని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులతో సదరు అంశంపై సమీక్షించి దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో జూ క్యూరేటర్ సెల్వం, ఆర్డిఓ నిషాంత్ రెడ్డి, జిల్లా పర్యాటక శాఖ అధికారి రూపేంద్రనాథ్ తదితర అధికారులు పాల్గొన్నారు.

టూరిజం అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించండి

కేంద్ర మంత్రికి ఎంఎల్‌ఏ సుధీర్‌రెడ్డి విన్నపం

శ్రీకాళహస్తి,ఆగస్టు 8 ప్రభాతవార్త
తిరుపతిజిల్లాలో వెలసిన శ్రీకాళహస్తీశ్వరాలయం అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి కేంద్ర టూరిజం,సాంస్కృతిక అభివృద్ధి శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌కు గురువారం కోరారు.పురాణ ప్రసిద్ధి చెందిన చారిత్రాత్మక గుర్తింపు కల్గిన చోళ వంశస్తులచే పునర్నిర్మాణం కల్గిన ఆలయాన్ని అభివృద్ధి పరచుటకు ప్రత్యేక నిధులు మంజూరు చేయాలన్నారు. పట్టణాన్ని టూరిజంకు అనుగుణంగా అభివృద్ధి చేయటానికి ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న భరద్వాజ తీర్థం నుంచి భక్తకన్నప్ప దుర్గమ్మ ఆలయానికి రోప్‌వే ఏర్పాటుకు రూ.41.85 కోట్లు కావాలన్నారు. ఎమినిటి సెంటర్ ఏర్పాటుకు రూ.2.24కోట్లు కావాలని కోరారు. క్యూకాంప్లేక్సుల నిర్మాణాలకు రూ.3.72కోట్లు గ్రానైట్ కట్‌స్టోన్ ఫ్లోరింగ్‌రూ.0.72కోట్లు మహాప్రకారానికి రూ.30కోట్లు స్వర్ణముఖి నది వద్ద ఘాట్‌లు ఏర్పాటుకు రూ.20కోట్లు కాల్వరగంకు రూ.8కోట్లు సౌండ్‌అండ్ లైటింగ్ రూ.6కోట్లు బస్‌షెల్టెర్లకురూ.1.5కోట్లు కేటాయించాలని కోరారు. దక్షిణ కాశి అభివృద్ధికి టూరిజం శాఖలో కలసి అభివృద్ధికి నిధులు కేటాయించాలని శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి కేంద్ర టూరిజం మంత్రికి విన్నవించారు. పరిశీలించి సాధ్యమైనంత నిధులు అందిస్తామని మంత్రి భరోసా ఇచ్చినట్లు తెలిసింది.

గ్రామీణ ప్రాంతాల్లో బాల్య వివాహాలు నివారించాలి

కలెక్టర్ సుమిత్‌కుమార్

కుప్పం, ఆగస్టు 8 ప్రభాతవార్త
కుప్పం నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల్లో బాల్య వివాహాలను అరికట్టాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. గురువారం స్థానిక మండల కార్యాలయంలో కలెక్టర్ వైద్య ఆరోగ్య శాఖపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాల ద్వారా అతి చిన్న వయసులోనే యువతులు గర్భం దాల్చి శారీరక సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. దీంతో కొన్నిసారు ప్రాణాలు సైతం కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. బాల్య వివాహాలతో కలిగే నష్టాలను ప్రజలకు వివరించాలన్నారు. అలాగే గర్భిణీ స్త్రీలు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. గర్భందాల్చిన సమయంనుంచి ప్రసవం అయ్యేదాకా ఎఎన్ఎంలు వారి ఆరోగ్య పరిరక్షణ బాధ్యతలు వహించాలన్నారు. మాతా శిశు మరణాలను నివారించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. హైరిస్క్ గర్భిణుల ఆరోగ్యంపై అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. మహిళలు సంపూర్ణ పౌష్టికాహారం తీసుకునేలా చొరవ చూపాలన్నారు. గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత లేకుండా చూడాలని ఆదేశించారు. కుప్పం నియోజకవర్గంలో చేపడుతున్న కంటి వెలుగు ఇంటింటి సర్వేను ఈనెల 15వతేది లోగా పూర్తి చేసి కంటి సమస్యలు ఉన్న వారి జాబితాను సిద్ధం చేయాలని ఆదేశించారు. అనంతరం వారికి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కళ్లద్దాలు, ఆపరేషన్లు నిర్వహించడం జరుగుతుందన్నారు. సమావేశంలో కంటి వెలుగు స్పెషలాఫీసర్ డా॥ అర్షిత, ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, రాష్ట్ర నేతడా॥ బిఆర్ సురేష్‌బాబు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎస్ఎంసి ఎన్నికలు

వి.కోట, ఆగస్టు 8 ప్రభాతవార్త
మండలంలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. 144 ఎంపిపి స్కూళ్లు, మూడు యుపి స్కూళ్లు, 26 జడ్పీ హైస్కూళ్లలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎన్నికలు జరిగాయి. విద్యార్థుల తల్లిదండ్రుల సమక్షంలో నూతన ఛైర్మన్, సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తహశీల్దార్ పార్వతి, ఎంపిడిఒ గోవర్ధన, ఎం ఇఒలు చంద్రశేఖర్, మురుగేష్‌లు వివిధ పాఠశాలల్లో ఎన్నికల సరళిని పరిశీలించారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

సచివాలయ సిబ్బందికి దిశానిర్దేశం చేసిన కమిషనర్ ఎన్. మౌర్య

తిరుపతి కార్పొరేషన్, ఆగస్టు 8, ప్రభాతవార్త
విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నగర పాలక సంస్థ కమిషనర్ ఎన్. మౌర్య సచివాలయ సిబ్బందిని హెచ్చరించారు. నగర పాలక సంస్థ పరిధిలోని సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న అమెనిటీ సెక్రటరీలు, శానిటరీ సెక్రటరీలు, టౌన్ ప్లానింగ్ సెక్రటరీ, హెల్త్ సెక్రటరీలతో పాటు ఆయా విభాగాల అధిపతులతో గురువారం కచ్చపి ఆడిటోరియంలో కమిషనర్ సమావేశం నిర్వహించారు. ఆయా విభాగాల సెక్రటరీల పరిధి, చేయాల్సిన పనులు వివరాలు తెలుసుకున్నారు. కమిషనర్ మాట్లాడుతూ మీకు కేటాయించిన విధులను బాధ్యతతో సక్రమంగా నిర్వహించాలని అన్నారు. అన్ని విభాగాల సెక్రటరీలు కలిసి మెలసి విధులు నిర్వహించాలని, ఇది తనది కాదు అంటూ నిర్లక్ష్యం వహించరాదని అన్నారు. సచివాలయ సిబ్బంది ప్రతి రోజు ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని అన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, మున్సిపల్ ఇంజినీర్ వెంకట్రామిరెడ్డి, డిఈలు విజయ్‌కుమార్ రెడ్డి, సంజయ్ కుమార్, నరేంద్ర, మహేష్, శ్రావణి, రాజు, హెల్త్ ఆఫీసర్, డాక్టర్ యువ అన్వేష్ రెడ్డి, డిసిపి శ్రీనివాసులు రెడ్డి, ఏసిపి బాల సుబ్రమణ్యం, మేనేజర్ చిట్టిబాబు, శానిటరీ సూపర్‌వైజర్లు చెంచయ్య, సుమతి తదితరులు పాల్గొన్నారు.

సమస్యను క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కారం
- ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు

చిత్తూరు, ఆగస్టు 8 ప్రభాతవార్త: డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమంలో ప్రజల నుండి అందిన సమస్యలను అధికారులు క్షేత స్థాయికి వెళ్ళి సమస్యను పరిశీలించి పరిష్కరించాలని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు ఆదేశించారు. చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో గురువారం ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరై నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ ప్రజల నుండి సమస్యలపై మొత్తం 34 సమస్యలు ప్రస్తావనకు రాగా వీటిని సత్వరం క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కరించడానికి చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే ప్రజల నుండి అందిన సమస్యలను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విన్నారు. ఆపై సమస్యల పరిష్కారం కోసం ఎమ్మెల్యే అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమీషనర్ రామకృష్ణుడు, ఎంహెచ్ఓ డాక్టర్ అనిల్‌కుమార్ నాయక్, మేనేజర్ గోపాలకృష్ణవర్మ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సూక్ష్మ, తుంపర సేద్యం పరికరాల కోసం దరఖాస్తులు

గుడిపాల, ఆగస్టు 8 ప్రభాతవార్త: సూక్ష్మ, తుంపర సేద్యం పరికరాల కోసం రైతులు మండల పరిధిలోని రైతు సేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని ఎపిఎంఐపి అధికారి సతీష్ తెలిపారు. బిందు, తుంపర సేద్యం పరికరాలు అవసరమైన రైతులు ఆధార్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకం, బ్యాంకు పాసు పుస్తకం జెరాక్స్ కాపీలు తీసుకెళ్ళి రైతు సేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఐదు, అంతకంటే తక్కువ ఎకరాల భూమి వున్న రైతులకు 90 శాతం, 5-10 ఎకరాల భూమి వున్న రైతులకు 70 శాతం రాయితీని ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. వివిఎ తులసీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు

పాలసముద్రం, ఆగస్టు 8 ప్రభాతవార్త: మండల పరిధిలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా ముగిసాయి. అత్యధిక పాఠశాలల్లో తెలుగుదేశం మద్దతుదారులు స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఛైర్మన్లుగా ఏకగ్రీవం అయ్యారు. మండల పరిధిలో ఐదు జడ్పీ ఉన్నత పాఠశాలలు వుండగా ఐదు జడ్పీ పాఠశాలల స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఛైర్మన్లు, వైస్ ఛైర్మన్ పదవులు ఏకగ్రీవం అయినట్లు ఎంఇఒ రాజేంద్రప్రసాద్ ప్రకటించారు. అలాగే మండల పరిధిలో 23 ప్రాథమికోన్నత, 5 ప్రాథమిక పాఠశాలలు వుండగా ఈ ఎన్నికల్లో సైతం తెలుగుదేశం మద్దతుదారులు విజయం సాధించారు. మండల పరిధిలో మొత్తం 33 పాఠశాలలు వుండగా ఇందులో 32 పాఠశాల స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలు తెలుగుదేశం మద్దతుదారులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సింహరాజపురం ప్రాథమిక పాఠశాల కమిటీ ఎన్నికలు వాయిదా పడ్డాయి. ఎస్ఆర్ కండ్రిగ జడ్పీ హైస్కూల్ స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఛైర్మన్‌గా వి.రంజిత్‌కుమార్, వైస్ ఛైర్మన్‌గా వనిత, తిరుమలరాజుపురం జడ్పీ హైస్కూల్ ఛైర్మన్‌గా ఎం.పయణి, వైస్ ఛైర్మన్‌గా బి.కవిత, వెంగళరాజుకుప్పం జడ్పీ హైస్కూల్ ఛైర్మన్‌గా ఓ.రాధిక, వైస్‌ఛైర్మన్‌గా జి.రాజా, ఆముదాల జడ్పీ ఉన్నత పాఠశాల ఛైర్మన్‌గా జి.రాబర్ట్, వైస్ ఛైర్మన్‌గా అమ్ములు, పాలసముద్రం జడ్పీ హైస్కూల్ ఛైర్మన్‌గా ఎ.గోపాలన్, వైస్ ఛైర్మన్‌గా మీనాలు ఎన్నికయ్యారు.

కుప్పాన్ని టూరిజం హబ్‌లా మార్చేందుకు ప్రణాళికలు
- కడ పి.డి. వికాస్ మర్మత్

కుప్పం, ఆగస్టు 8 ప్రభాతవార్త

కుప్పం నియోజకవర్గాన్ని టూరిజ ం హబ్‌గా తయారు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. స్థానిక కడ కార్యాలయంలో టూరిజం, రవాణాశాఖ అధికారులతో జరిగిన సమావేశంలో పి.డి. మాట్లాడారు. కుప్పం నియోజకవర్గం చెన్నై, బెంగళూరు నగరాలకు సమీపంలో ఉందని దీంతో ఇక్కడ టూరిజం అభివృద్ధి చేయాలన్నారు. రామకుప్పం మండలంలోని ననియాల ఎకో టూరిజం, కుప్పం మండలం కంగుంది దుర్గం, శ్రీ బేటరాయస్వామి కొండ, గుడుపల్లె మండలం మల్లప్పకొండ, గుడివంక ఆలయాలతో పాటు అగస్త్య ఫౌండేషన్, చెలిమిచేను జలపాతం వంటి టూరిజం స్థలాల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై డిపిఆర్ సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో టూరిజ ం శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ డా॥ రమణ ప్రసాద్, డిఇ శ్రీనివాసులురెడ్డి, డిటిసిఒ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

బిఆర్‌డి ఆస్పత్రిలో ఉచిత సంతానసాఫల్య వైద్య శిబిరం

కుప్పం, ఆగస్టు 8 ప్రభాతవార్త కుప్పంలోని బిఆర్‌డి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఈనెల 11న ఉచిత సంతాన సాఫల్య వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి ఛైర్మన్ డా॥ బిఆర్ సురేష్‌బాబు పేర్కొన్నారు. సంతానం లేని దంపతులకు ప్రయోజనం కల్పించేందుకు ఈ శిబిరం ఏర్పాటుచేశామన్నారు. బెంగళూరు నోవా ఐవిఎఫ్ డా॥ లావణ్య, ప్రముఖ గైనకాలజిస్ట్ డా॥ హరిత మండవ ఆధ్వర్యంలో సంతానం లేని దంపతులకు తగు వైద్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వివరాలకు 7729028405,9398631629నెంబర్లను సం ప్రదించాలన్నారు.

పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు

తవణంపల్లె, ఆగస్టు 8 ప్రభాతవార్త: ప్రభుత్వ ఆదేశాల మేరకు గురువారం మండలంలో జరిగిన పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మ ఈ మేరకు మండలంలోని ఐదు జడ్పీ ఉన్నత పాఠశాలలు,61 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలో పగడ్బందీగా ఎన్నికల ప్రక్రియను చేపట్టారు. నూతనంగా ఎన్నికైన కమిటీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌ల చేత ఎంఈఓలు ఆధ్వర్యంలో ఆయా పాఠశాలల హెచ్ఎంలు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ మేరకు మండల కేంద్ర తవణంపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం దేవరాజులురెడ్డి నూతన కమిటీచే ప్రమాణ సీ ్వకారం చేయించారు. ఈకార్యక్రమంలో స్థానిక విఆర్ఓలు పాల్గొన్నారు.

ఐరాలలో...

ఐరాల, ఆగస్టు 8 ప్రభాతవార్త: మండలంలో గురువారం జరిగిన పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఈమేరకు ఎంపీడీఓ వెంకటేశులు, తహశీల్దార్ మహేష్‌కుమార్, ఎంఈఓలు రుష్యేంద్రబాబు, దామోదర్‌నాయుడుల ఆధ్వర్యంలో మండలంలోని ఏడు జడ్పీ ఉన్నత పాఠశాలలు, నాలుగు ప్రాథమికోన్నత 54 ఎంపీపీ పాఠశాలల్లో పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికైన కమిటీలచే ప్రమాణస్వీకారం చేయించారు.

తహశీల్దార్‌గా రమేష్ బాబు బాధ్యతల స్వీకరణ

వెదురుకుప్పం, ఆగస్టు 8 ప్రభాతవార్త : తహశీల్దార్‌గా రమేష్ బాబు గురువారం కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. గతంలో తహశీల్దార్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న జయంత్ కుమార్ బదిలీలపై యాదమరి మండలంకు వెళ్ళడంతో ఆయన స్థానంలో నూతన తహశీల్దార్‌గా రమేష్ బాబు స్వీకరించారు.

పాఠశాలల అభివృద్ధికి పాటుపడాలి
-నూతన కమిటీలకు దిశానిర్దేశం

చౌడేపల్లి, ఆగస్టు 8 ప్రభాతవార్త

పాఠశాలల అభివృద్ధికి నూతన యాజమాన్య కమిటీలు పాటుపడాలని మండల తేదేపా అధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి(చిట్టి) అన్నారు. మండల వ్యాప్తంగా గల 77ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నతపాఠశాలల్లో యాజమాన్య కమిటీల ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా సహకరించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులను అభినందించారు. నూతన యాజమాన్య కమిటీలు రాజకీయాలకు చోటివ్వకుండా ప్రభుత్వ లక్ష్యాలను నెరవేర్చాలన్నారు. స్థానిక ఉన్నతపాఠశాల కమిటీ అధ్యక్షుడుగా బత్తలాపురం బాకా సుధాకర్, ఉపాధ్యక్షురాలుగా రాధికను ఎన్నుకొన్నారు. తేదేపా నాయకులు ఆవుల రామచంద్రయ్య, పవన్‌కుమార్, రెడ్డిప్రసాద్, అర్జున్, ప్రధానోపాధ్యాయుడు నాగరాజరెడ్డి, ఎన్నికల పరిశీలకుడు నాగరాజరెడ్డి, ఉపాధ్యాయులు మురళీ, ఈశ్వర్, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

స్మశాన వాటికకు స్థల పరిశీలన

చౌడేపల్లి, ఆగస్టు 8 ప్రభాతవార్త

పట్టణంలోని నాయనివారిపాళెంకు సంబంధించిన స్మశాన వాటిక కోసం స్థలాన్ని పరిశీలించారు. స్మశాన వాటికకు స్థలాన్ని చూపాలని ఈనెల 7న నాయనివారిపాళెం వాసులు రెవిన్యూ అధికారులకు వినతి పత్ర మందించారు. స్పందించిన తహశీల్దార్ హనుమంత్ నాయక్ సిబ్బందితో వెళ్ళి స్థలాన్ని పరిశీలించారు. పట్టణానికి సమీపంలోని కందికుంట వద్ద సర్వేనంబర్ 140-1లో 0.50సెంట్ల స్థలాన్ని స్మశానవాటికకు కేటాయించారు. దీంతో నాయనవారిపాళెం ప్రజలు రెవిన్యూ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

కైలాస ధామంకు అమరరాజా అధినేత రూ.50 లక్షలు విరాళం

చిత్తూరు, ఆగస్టు 8 ప్రభాతవార్త: చిత్తూరు స్మశాన వాటికలో నూతనంగా నిర్మిస్తున్న గ్యాస్ బర్నింగ్ స్మశాన వాటికకు అమరరాజా ఫ్యాక్టరీ అధినేత గల్లా రామచంద్రనాయుడు 50 లక్షల రూపాయల విరాళంను ప్రకటించారు. అమరరాజా ఫ్యాక్టరీస్ అధినేత గల్లా రామచంద్రనాయుడు గురువారం చిత్తూరు స్మశాన వాటికలో ఆర్యవైశ్య సంఘం, లయన్స్‌క్లబ్ ఉమ్మడిగా నిర్మిస్తున్న కైలాస ధామంను పరిశీలించారు. ఈ స్మశాన వాటిక అందరికి సౌకర్యంగా వుండటంతో తన వంతు సహాయంగా తన మామ రాజగోపాల్‌నాయుడు పేరిట 50 లక్షల రూపాయలను గల్లా అమరరాజ సంస్థ ద్వారా అందిస్తానని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్, ఆర్యవైశ్య సంఘ సభ్యులు పాల్గొన్నారు.

చిత్తూరు డిఎస్పీ రాజగోపాల్‌రెడ్డి బదిలీ

చిత్తూరు, ఆగస్టు 8 ప్రభాతవార్త:

చిత్తూరు డిఎస్పీ ఎం.రాజగోపాల్‌రెడ్డిని బదిలీ చేస్తూ రాష్ట్ర డిజిపి కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. చిత్తూరు నుండి బదిలీ అయిన డిఎస్పీ ఎం.రాజగోపాల్‌రెడ్డికి మరో ప్రదేశంలో పోస్టింగ్ కేటాయించకుండా నేరుగా డిజిపి కార్యాలయంలో రిపోర్టు చేసుకోవాలని ఉత్తర్వులు జారీ అయ్యాయి. అదే సమయంలో చిత్తూరు డిఎస్పీగా ఎవరిని నియమించలేదు. ఒకటి రెండు రోజుల్లో చిత్తూరు పోలీసు సబ్ డివిజన్‌కు నూతన డిఎస్పీని నియమించే అవకాశం వుంది.

తహసిల్దారుగా చంద్రశేఖర్‌రెడ్డి బాధ్యతలు స్వీకరణ

గుడిపాల, ఆగస్టు 8 ప్రభాతవార్త:

గుడిపాల మండల నూతన తహసిల్దారుగా చంద్రశేఖర్‌రెడ్డి గురువారం తహసిల్దారు కార్యాలయంలోని తన ఛాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. రెవెన్యూ సంబంధిత సమస్యలను సత్వరం పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు.

చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

దాతల వితరణతో డిగ్రీకాలేజి కాలనీకు మహర్దశ

పుంగనూరు,ఆగస్టు 8 ప్రభాతవార్త సేవాభావం మనసులో ఉండాలేకానీ,ఎటువంటి సమస్యకైనా పరిష్కారం సాధ్యమని నిరూపించారు పట్టణానికి చెందిన ఇద్దరు దాతలు.పట్టణంలోని శుభారాం డిగ్రీకాలేజి వెనుక ఉన్న కాలనీలకు రోడ్డు సమస్య చాలా ఏళ్ళుగా బాధిస్తోంది. ఈవిషయాన్ని గమనించిన దేశం నాయకుడు శ్రీకాంత్,మున్సిపల్ కమీషనర్ నర్సింహప్రసాద్‌లు భూ మి యజమానులను సంప్రదిం చారు.దీంతో అక్కడి భూయజమానులు అప్పల్లాకృష్ణమూర్తి, బాలకృష్ణ అలి యాస్ బుజ్జిలు తమకు చెందిన భూమిని విరాళంగా ఇవ్వడానికి ముందకు వచ్చారు. కమీషనర్ స్పందిస్తూ దాతల ఉదారత ఎంతో ప్రశంసనీయమన్నారు. త్వరలో మట్టిరోడ్డు ఏర్పాటుచేయడానికి చర్యలు తీసుకుంటా మన్నారు.

హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని విజయవంతం చేయండి
- భాజపా నేతల పిలుపు

చిత్తూరురూరల్, ఆగస్టు 8 ప్రభాతవార్త:

ప్రజల హృదయాల్లో దేశభక్తి భావాన్ని నింపడం కోసం హర్ ఘర్ తిరంగా పేరుతో ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాయలసీమ జోన్ ఇన్‌ఛార్జీ, మాజీ ఎమ్మెల్యే రామచంద్రారెడ్డి, జిల్లా భాజపా అధ్యక్షుడు జగదీశ్వరనాయుడులు పిలుపునిచ్చారు. గురువారం జిల్లా భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 13.14.15 తేదిలలో మూడురోజుల పాటు ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసేలా కార్యక్రమాలను రూపొందించి పర్యవేక్షించాలని కోరారు.. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గసభ్యులు, మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్వరచౌదరి, మాజీ రాజ్యసభ సభ్యురాలు దుర్గారామక్రిష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి అట్లూరిశ్రీనివాసులు, ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సి.బాబు, జిల్లా ఉపాధ్యక్షులు బ్రహ్మానందరెడ్డి, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు రవికుమార్, మండల అధ్యక్షులు షణ్ముగం, రామభద్ర, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నిరాశ్రయులపై దాతృత్వాన్ని చాటుకున్న హనీ ప్రెండ్స్ గ్రూపు

చిత్తూరురూరల్, ఆగస్టు 8 ప్రభాతవార్త:

చిత్తూరు నగరంలో మెప్మా, నగరపాలక సంస్థ సహకారంతో సపోర్టు సంస్థ నిర్వహిస్తున్న నిరాశ్రయుల వసతి గృహంను హనీ ప్రెండ్స్ గ్రూపు సభ్యులు సందర్శించి నిరాశ్రయులకు నూతన వస్త్రాలు,దుప్పట్లు, ప్లేట్స్, గ్లాసులను వితరణ చేసారు. విశ్రాంతి ఉద్యోగులు నిరాశ్రయులపై ఎనలేని ప్రేమను చూపించి సేవలు చేయడం అభినందనీయమని సపోర్టు సంస్థ అధ్యక్షుడు జోసఫ్‌రాజు కొనియాడారు. ఈ కార్యక్రమంలో హనీ ప్రెండ్స్‌గ్రూప్ సభ్యులు కృపావరమ్మ, కే.యం సుశీల, సపోర్టుసంస్థ అధ్యక్షుడు జోసఫ్‌రాజు, వసతిగృహ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అర్ధగిరి హుండీల ద్వారా 17.63 లక్షలు ఆదాయం

తవణంపల్లె, ఆగస్టు 8 ప్రభాతవార్త:

ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీవీరాంజనేయస్వామి దేవస్థానంకు హుండీ లెక్కింపు ద్వారా రూ.17.63 లక్షలు ఆదాయంగా లభించింది. గురువారం ఆలయ ఈఓ టి.హనుమంతురావు ఆధ్వర్యంలో అరగొండ సప్తగిరి గ్రామీణ బ్యాంకు వారిచే హుండీ లెక్కింపు నిర్వహించారు. ఈసందర్భంగా 135 రోజులకు గాను 17,63,301 రూపాయలు ఆదాయంగా వచ్చింది. అలాగే 11 గ్రాముల బంగారు. 386 గ్రాముల వెండి, 67 అమెరికన్ డాలర్లు, 67 సౌదీ రియాల్స్, 15 కువైట్ దినార్స్ ఆదాయంగా వచ్చింది. ఈ హుండీ లెక్కింపు కార్యక్రమంలో ఆలయ మాజీ ఛైర్మన్ పి.సురేంద్రారెడ్డి, దేవాదాయశాఖ అధికారి మునిరాజ, సప్తగిరి గ్రామీణ బ్యాంకు ఆఫీసర్ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాల్లో అనధికార ప్రవేశాలొద్దు : హనుమంత్ నాయక్

చౌడేపల్లి, ఆగస్టు 8 ప్రభాతవార్త ప్రభుత్వ స్థలాల్లో అనధికార ప్రశాలొద్దని తహశీల్దార్ హనుమంత్ నాయక్ అన్నారు. మండలంలోని దిగువపల్లి పంచాయతీ గాజులవారిపల్లి సమీపంలోగల ప్రభుత్వ స్థలాల్లో కొందరు వ్యక్తులు అనధికారికంగా మిషనరీలు ఉపయోగించి చదును చేస్తున్న విషయాన్ని గ్రహించిన రెవిన్యూ అధికారులు వారిని అడ్డుకొన్నారు. పట్టాదారుడు లేకుండా ఇతరులు వారి భూమిలోకి ప్రవేశించ రాదన్నారు. వంకలు, కుంటలు, చెక్‌డ్యామ్‌లు వంటివి పూడ్చరాదన్నారు. మండల సర్వేయర్ గుణశేఖర్, రెవిన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

ఆర్టీసీ బస్సులోనే సురక్షిత ప్రయాణం
ఎమ్మెల్యే రామకృష్ణ

వెంకటగిరి, ఆగస్టు 8 ప్రభాతవార్త

ఆర్టీసి బస్సులోనే ప్రయాణం సురక్షితమని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. వెంకటగిరి నుండి విజయవాడకు నడిచే రెండు కొత్త ఆర్టీసీ బస్సులను ఎమ్మెల్యే ప్రారంభించారు. వెంకటగిరి నుండి నెల్లూరు తిరుపతి మార్గాల్లో ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా ప్రతి అరగంటకు బస్సులు నడుపుతామని తెలిపారు. ఇప్పటికే బెంగళూరుకు బస్సులు నడుపుతున్నారని చెన్నైకి కూడా నడుపుతారని తెలిపారు. అనంతరం జండా ఊపి బస్సులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి జి. నాగేశ్వర రావు, మాజీ ఏఎంసి చైర్మన్ రాజేశ్వర రావు, రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి కెవికె ప్రసాద్ నాయుడు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రాజేశ్వర రావు, మండల పార్టీ అధ్యక్షుడు చంద్రమౌళి రెడ్డి తదితరులు ఉన్నారు.

నాయకుల సమన్వయంతోనే ఎస్ఎంసిలలో హవా
- మండల టిడిపి కన్వీనర్ గణపర్తి కిషోర్‌నాయుడు

చిట్టమూరు, ఆగస్టు 8 ప్రభాతవార్త

చిట్టమూరు మండలంలోని 23 పంచాయతీల్లో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తల సహాయ సహకారాలతోనే విద్యాకమిటీ ఎన్నికల్లో 98 శాతం విజయం సాధించామని మండల టిడిపి కన్వీనర్ గణపర్తి కిషోర్‌నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా చిట్టమూరు టిడిపి కార్యాలయంలో ఆయనను పలువురు విద్యాకమిటీ ఛైర్మన్లు, వైఎస్ ఛైర్మన్లు కలిసి మిఠాయిలు తినిపించడంతో వారందరినీ కిషోర్‌నాయుడు అభినందించారు. ఆయన మాట్లాడుతూ మల్లాంలో కామిరెడ్డి సునీల్‌రెడ్డి, ఈశ్వరవాకలో గుండుబోయిన కస్తూరయ్య, యాకసిరిలో కృష్ణారెడ్డి, అరవపాలెంలో రాజేష్‌రెడ్డి, మన్నెమాలలో జనార్ధన్‌రెడ్డి, యల్లసిరిలో కాపులూరు చెంచురామయ్య ఆచారి, మొలకలపూడిలో వెంకటరమణ, కోగిలిలో రషీద్‌భాయ్, గునపాడులో మోహన్‌రెడ్డి, గునపాటిపాలెంలో అంకబాబు, పెళ్లకూరులో శీనయ్య, మెట్టులో శ్రావణ్, ఉప్పలమర్తిలో శీనయ్య, వెంకటేష్, చిల్లమూరులో మునిబాబు, ఓమనరావు, వెంకటేశ్వర్లు, తాడిమేడులో ఈపూరు సుందరయ్య, ఆరూరులో గిరిజనాయుడు, శివ, ముత్తురాజా, ముక్కుడుపాలెంలో భారతమ్మ, పల్లంపర్తిలో అజయ్, ఎల్లూరులో సుధాకర్‌రెడ్డి, బిజికెపాలెంలో యర్రబోతు కుమార్, చిట్టమూరులో బషీర్, సురేష్, శ్రీను, నార్త్‌వరత్తూరు పంచాయతీలో మధుల సహాయ సహకారాలతో ఈ విజయం సాధించినట్లు కిషోర్‌నాయుడు ధన్యవాదాలు తెలియజేశారు. రాబోవు పంచాయతీ ఎన్నికల్లో సైతం ఇదే ఉత్సాహాన్ని కనబరిచి తెలుగుదేశం పార్టీ అభ్యర్థుల విజయానికి శ్రీకారంచుట్టి గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్‌కు అన్ని పంచాయతీల సర్పంచులను బహుమతిగా ఇవ్వాలని దిశానిర్దేశం చేశారు.

డిపో మేనేజర్ నిర్లక్ష్య వైఖరి విడనాడాలి
ఎన్ఎంయుఏ స్టేట్ సెక్రటరీ చెంచులయ్య

గూడూరు, ఆగస్టు 8, ప్రభాతవార్త

ఆర్టీసి కార్మికుల పట్ల డిపో మేనేజర్లు నిర్లక్ష్యంగా ఉన్నారని అసభ్య పదజాలంతో దూషిస్తున్నారని ఉన్నతాదికారులు ఇటువంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని లేని యెడల రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు చేపడతామని నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ స్టేట్ సెక్రటరీ చెంచులయ్య తెలిపారు. గూడూరు ఆర్టీసీ డిపో ఎదుట ఎన్ఎంయుఏ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మహిళలకు నెలలో మూడు రోజుల సెలవు ఇవ్వడం లేదని, సమస్యలపై మాట్లాడడానికి వెళ్లిన కార్మికులపై దురుసుగా మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.శేఖర్, వెంకయ్య, శ్రావణ్, ఎస్‌కె భాష, ప్రవీణ్ పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల వ్యవస్థ పునరుద్ధరించడంపై హర్షం

గూడూరు, ఆగస్టు 8, ప్రభాతవార్త గత వైసిపి ప్రభుత్వంలో రేషన్ డీలర్ల వ్యవస్థ నిర్వీర్యం అయిపోయిందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మరల రేషన్ డీలర్ వ్యవస్థను పునరు ద్ధరించడం సంతోషంగా ఉందని గూడూరు రేషన్ డీలర్ల అసోసియేషన్ నిర్వాహకులు రవి తెలిపారు. ఈ సందర్భంగా గూడూరు పట్టణంలో రేషన్ డీలర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో డీలర్లు ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు.

వయనాడ్ బాధితులకు విరాళాల సేకరణ

గూడూరు, ఆగస్టు 8, ప్రభాతవార్త

గూడూరు పట్టణంలో సిపిఎం పార్టీ నాయకులు ఆధ్వర్యంలో కేరళ రాష్ట్రం వయనాడ్ ప్రాంతంలో జరిగిన ప్రమాద వరద బాధితుల సహాయార్థం కోసం విరాళాలు సేకరించారు. గూడూరు రెండవ పట్టణ ప్రాంతంలో నివాసం ఉంటున్న గూడూరు రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షులు ఎల్లసిరి గోపాల్ రెడ్డి పది వేల రూపాయిలు వయనాడ్ బాధితులకు అందించారు. అనంతరం కోర్టు సెంటర్, నరసింగారావు పేట, ఏరియాల్లో ప్రజాసంఘాల కార్యకర్తల ఆధ్వర్యంలో విరాళాలు పదమూడు వేల ఆరువందల యాభై రూపాయిలు సేకరించారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు పి. శ్రీనివాసులు, గూడూరు శాఖ కార్యదర్శి జోగి శివకుమార్, సివిటియు నాయకులు టి. వెంకట రామిరెడ్డి, బివి రమణయ్య, ఎస్. సురేష్, పుట్టా శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎస్ఎంసి చైర్మన్ ఎన్నికలు

చిల్లకూరు, ఆగస్టు 8, ప్రభాతవార్త

ప్రశాంత వాతావరణంలో గురువారం ఎస్ఎంసి చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయని ఎంఈఓ డి. సనత్ కుమార్ అన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ మండలంలో మొత్తం 72 పాఠశాలలో ఉన్నాయన్నారు. వాటిల్లో 9 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఒకటి ఏపీ రెసిడెన్షియల్ 53 ప్రైమరీ పాఠశాలలో 9 యుపి స్కూల్‌లో ఉన్నాయన్నారు. వీటికి సంబంధించి ఎస్ఎంసి ఎన్నికలు నిర్వహించగా 50 పాఠశాలలో ఏకగ్రీవంగా చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నుకున్నారన్నారు. అదే విధంగా విద్యార్థి తల్లిదండ్రులు బహిరంగంగా చేతులెత్తి ఎంపిక ద్వారా 20 పాఠశాలలో చైర్మన్ వైస్ చైర్మన్ ఎన్నుకోవడం జరిగిందన్నారు. అదే విధంగా జడ్పి ఉన్నత పాఠశాల పిసి వారిపాలెం, ఎంపియుపి పాఠశాల ఓడూరు పాఠశాలలో విద్యార్థులు తల్లిదండ్రులు హాజరు కాకపోవడంతో ఎన్నికలు వాయిదా పడ్డాయి. తిక్కవరం జిల్లా ఉన్నత పాఠశాలలో చైర్మన్ ఎంపిక వాయిదా పడిందని వారు తెలిపారు. వాయిదా పడిన మూడు పాఠశాలలో రెండు రోజుల్లో చైర్మన్ ఎన్నికలు నిర్వహించబడుతాయని అన్నారు.

స్మశానం అభివృద్ధి

వాకాడు, ఆగస్టు 8, ప్రభాతవార్త

వాకాడు మండలం కొత్తపాలెం గ్రామంలోని గురువారం టిడిపి నియోజకవర్గ ఎస్సి సెల్ ప్రధాన కార్యదర్శి కార్తిక్ ఆధ్వర్యంలో స్మశానం జెసిబితో అభివృద్ధి చేశారు. ఎన్నో ఏళ్ళగా స్మశానం కబ్జాకు గురైందని ప్రభుత్వ సర్వేయర్లు ద్వారా కొలతలు చేసి నా ప్రకారం జెసిపితో అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, దాత దువ్వూరు జనార్ధన్ రెడ్డి సొంత నిధులతో స్మశాన ప్రహరీతో పాటు స్మశాన వాటిక గేటు ఏర్పాటు చేస్తున్నాడని కొత్తపాలెం గ్రామం తరపున ప్

మహిళా యూనివర్శిటీలో రక్తదాన శిబిరం

తిరుపతి విద్య, ఆగస్టు 8, ప్రభాతవార్త శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ విభాగం, కస్టమ్స్ ప్రివెంటివ్ విభాగం తిరుపతి వారు సంయుక్తంగా మహిళా వర్సిటీలోని హెల్త్ సెంటర్‌లో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని డీన్ స్టూడెంట్ అఫైర్స్ ప్రొఫెసర్ జె. కాత్యాయని, అసిస్టెంట్ కమిషనర్ కస్టమ్స్ డివిజన్ బ్రాంచ్ సి. విజయ భాస్కర్ ప్రారంభించారు. రక్తదానం యొక్క ప్రాముఖ్యతను, రక్తదానం ద్వారా ప్రాణదానం ఒక విశిష్ట అవకాశమని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు, వాలంటీర్స్‌కి వివరించారు. ముప్పై మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో డా. అనన్య మహిళా యూనివర్శిటీ హెల్త్ సెంటర్, మెడికల్ ఆఫీసర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డా. పి. నీరజ, డా. బి. సుజాత, డా.ఎస్. శాంతి, వి. భార్గవి, డా. వై. సునీత, డా. కెఆర్‌పద్మ, డా. బి. వైశాలీయశాలి, డా. హేమలత, దివ్య పాల్గొన్నారు.

గ్రంథాలిపిపై నిర్వహిస్తున్న శిక్షణ శిబిరం ముగింపోత్సవం

తిరుపతి విద్య, ఆగస్టు 8, ప్రభాతవార్త జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం తిరుపతిలో రీసెర్చ్ అండ్ పబ్లికేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నటువంటి గ్రంథలిపి ప్రశిక్షణ శిబిరం గురువారంతో ముగిసింది. గత రెండు వారాలుగా ప్రాచీన ఐదో శతాబ్దానికి సంబంధించిన గ్రంథలిపి ఏదైతే ఉందో దాని పైన విశ్వవిద్యాలయంలోని అధ్యాపకులకు ఈ గ్రంథ లిపిపై ప్రశిక్షణ శిభిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య ముఖ్య అతిథి విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జిఎస్సార్ కృష్ణమూర్తి మాట్లాడుతూ మన భారతీయ భాషలు అనేకమైనవి ఉన్నవి. అందులో ఐదో శతాబ్దానికి చెందినటువంటి ప్రాచీన గ్రంథిపి ఒకటి. ఈ గ్రంథలిపిపై విశ్వవిద్యాలయంలోని అధ్యాపకులందరికీ కూడా గత రెండు వారాలుగా నేర్పించడం జరిగింది. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయంలో అధ్యాపకులు సంస్కృతంతో పాటు ఇతరులు, ఇతర భాషలపైనా కూడా జ్ఞానాన్ని సంపాదించి తద్వారా ఈ గ్రంథ లిపిలో ఉన్నటువంటి అనేకమైన మాతృక గ్రంథాలను రీసెర్చ్ చేయడానికి ఎంత ఉపయోగపడుతుంది అని వివరించారు. అనంతరం ఈ గ్రంథ లిపిపై ప్రశిక్షణా ఇచ్చినటువంటి ఆచార్యులు ప్రొఫెసర్ శంకరనారాయణ మాట్లాడుతూ ఈ పది రోజుల పాటు విశ్వవిద్యాలయం అధ్యాపకులకు ఈ యొక్క గ్రంథాలిపిపై చక్కగా పరిశోధన చేసి ప్రాచీన జ్ఞానాన్ని ఆధునిక తరానికి అందించడానికి ఒక వారిదిగా నిలబడుతుందని తెలియజేశారు. ఈ ప్రశిక్షణ కార్యక్రమానికి కోఆర్డినేటర్‌గా రీసెర్చ్ అండ్ పబ్లికేషన్స్ విభాగ అధ్యక్షులు ప్రొఫెసర్ శివరామభట్ట్ వ్యవహరించి రెండు వారాలు పాటు చక్కగా శిక్షణ జరిగేలాగా కోఆర్డినేట్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సాహిత్య సంస్కృతి డీన్ ప్రొ. డి. లలితావాణి, అకాడమిక్ డి. ప్రొఫెసర్ రజనీకాంత్ శుక్ల, ఐక్యూఎస్ డైరెక్టర్ ప్రొఫెసర్ సతీష, విశ్వవిద్యాలయంలోని విభిన్న విభాగాల అధ్యాపకులు పాల్గొన్నారు. ఎవరైతే ఈ రెండు వారాలు పాటు ఈ యొక్క శిక్షణ కార్యక్రమంలో పాల్గొని గ్రంథలిపి నేర్చుకున్నారో వారికి ప్రమాణ పత్రాలను ఇవ్వడం జరిగింది.

చిట్టి చేతులు - గట్టి చేతులు

తిరుపతి విద్య, ఆగస్టు 8, ప్రభాతవార్త

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కేరళలోని వయనాడు జిల్లా అతలాకుతలం అయిన సంగతి పాఠశాలకు గుర్తుండే ఉంటుంది. సుమారు 300 మంది ప్రాణాలు కోల్పోయారు. కొందరు ఆచూకీ నేటికీ దొరకలేదు. గల్లంతైన వారు వెళ్ళల్లోనే ఉన్నారు. ప్రక్క సోదర రాష్ట్రంలో ఇంత వివత్తు జరిగితే మందకొడిగా ఉన్న స్పందనలను చూచి, చలించి పోయారో ఏమో స్థానిక రాఘవేంద్ర నగర్ రెడ్ చెర్రీస్ విద్యార్థులు గట్టి మేలు తలపెట్టవోయ్ అన్నగురజాడ వాక్కులను స్ఫూర్తిగా తీసుకొని సేవ్ వయనాడు అనే ప్లకార్డులతో, ఎంతో మందిలో స్పందనలను రాగిలించారు. తల్లిదండ్రులను ఆలోచనలో పడేశారు. దాతృత్వం ఇంటి నుండే మొదలవ్వాలనే నానుడిని మనందరికీ గుర్తు చేసిన చిన్నారులను పలువురు అభినందిస్తున్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ మురళీధర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

తహసిల్దార్‌ను సత్కరించిన ఎంపిడివో

సత్యవేడు, ఆగస్టు08, ప్రభాతవార్త: సత్యవేడు మండల నూతన తహసిల్దార్‌గా ఇటీవల భాద్యతలు స్వీకరించిన సుబ్రమణ్యంను స్థానిక ఎంపిడివోచంద్రశేఖర్ కలిశారు. గురువారం రెవిన్యూ కార్యాలయంలో తహసిల్దార్‌ను శాలువా పూలమాలతో ఆయన సత్కరించారు. ఇరువురు వృత్తిరీత్యా ఎదురవుతున్న సవాళ్ళును, సమస్యల పరిష్కారానికి చేయవలసిన కృషిపట్ల చర్చించుకున్నారు. ఈకార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ శివయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వినాయగసాగర్‌ను అన్ని విధాలా తీర్చిదిద్దండి

–ఎమ్మెల్యేఆరణికి వినాయక కమిటీ వినతి

తిరుపతిటౌన్, ఆగస్ట్ 8ప్రభాతవార్త: పుణ్యక్షేత్రం తిరుపతినగరానికి సంబంధించి వినాయకవిగ్రహాలు నిమజ్జనం చేసే వినాయకసాగర్‌ను అన్ని విధాలా అనుకూలంగా తీర్చిదిద్దేలా చూడాలని వినాయక మహోత్సవ కమిటీ సభ్యులు కోరారు. వినాయకసాగర్‌లో చేపట్టాల్సిన ఏర్పాట్లు, వివిధ ప్రభుత్వశాఖల సమన్వయం, టిటిడి సహకారంపై స్వయంగా కలుగజేసుకుని అన్ని విధాలా సహకరించాలని తెలిపారు. వినాయకసాగర్ అభివృద్ధిపై వినాయక మహోత్సవ కమిటీ ప్రతినిధులు కన్వీనర్ సామంచి శ్రీనివాస్, సభ్యులు గుండాల గోపీనాథరెడ్డి, ఆర్‌సి మునికృష్ణ, విజయకుమార్, మాంగాటి గోపాల్‌రెడ్డి, మల్లారపు రవిప్రసాద్, ఎస్వీఎంవెంకటేశ్, గోపి, ప్రసాద్, వాసు, నవీన్, డిపి ఆనంద్ ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజే శారు.

ముచ్చివోలు పాఠశాల కమిటి ఎన్నికలు

శ్రీకాళహస్తిరూరల్, ఆగస్టు 8 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి మండలం ముచ్చివోలులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఉదయం విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాఠశాల నిర్వహణలో కమిటి ప్రాధాన్యతను వివరించారు. ఈ సందర్భంగా 15మందిని కమిటిగా ఎన్నుకున్నారు. కమిటి చైర్మెన్‌గా మునిరామయ్య, వైస్ చైర్మెన్‌గా లావణ్యలను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో గ్రామానికి చెందిననాయకులునరసయ్య, మురళీకృష్ణారెడ్డి, కే. మల్లికార్జున్, ఎం. శివకుమార్, కృష్ణమనా యుడు, నారాయణ, రంగయ్య, భాస్కర్, పెంచలయ్యలు పాల్గొని పాఠశాల కమిటిని ఏకగ్రీవంగా ఎంపిక చేసారు.

తొలుగుతున్న మురుగు: దోమల సమస్య పరిష్కారం

–విజయకుమార్‌నాయుడు

శ్రీకాళహస్తి, ఆగస్టు 8 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి మున్సిపాలిటిలోని మురుగునీటి కాలువల్లో పేరుకుపోయిన సిల్టును మున్సిపల్ అధికారులు, సిబ్బంది శాసనసభ్యుడు వెంకటసుధీర్‌రెడ్డి ఆదేశాలతో తొలగిస్తున్నారని పట్టణ పార్టీ అధ్యక్షుడు జి. విజయకుమార్‌నాయుడు అన్నారు. పట్టణంలోని మురుగునీటి కాలువల్లో ఏళ్ళ తరబడి మురుగుపేరుకుపోయింది. అయితే గతంలో అధికారులు కానీ పాలకులు పట్టించుకోలేదన్నారు. సుదీర్‌రెడ్డి గెలిచిన వెంటనే పట్టణంలో పారిశుద్ధ్యానికి మొదటి ప్రాధాన్యత ఇచ్చారు. అంతేకాక మున్సిపల్ శాఖ నుంచి మొదటి విడతగా రూ. 59.75లక్షలు నిధులు సాధించారు. ఈ నిదులతో ఓటేరు కాల్వను బాగు చేయటానికి కేటాయించారని విజయకుమార్‌నాయుడు తెలిపారు. నేడు పెద్దమసీదు వీధి, జయరామారావువీధి, నాలుగుమాడావీధుల్లో కాలువలు శుభ్రం అయ్యాయని వివరించారు. కన్నలి కాలువను కూడా త్వరలోనే బాగు చేయటానికి ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వివరించారు. ఓటేరు కాలువ వీధిలో సిల్టుతొలగింపు పనులను విజయకుమార్‌నాయుడు, తిరుపతి పార్లమెంటు కోశాధికారి కంఠా రమేష్‌లు పరిశీలించారు.

బ్రాహ్మణ పల్లి దళిత వాడలో గంగమ్మ ఆలయం

శ్రీకాళహస్తి, ఆగస్టు 8 ప్రభాతవార్త

శ్రీకాళహస్తికి సుమారు 18కిలో మీటర్ల దూరంలోని బ్రాహ్మణ పల్లి దళిత వాడలో నూతనంగా నిర్మించిన గంగమ్మ ఆలయం కుంభాభిషేకం వైభవంగా నిర్వహిస్తున్నారు. దళిత వాడలోని కుటుంబాలు వారి స్థోమతకు తగ్గట్లు విరాళాలు పొగు చేసుకున్నారు. పట్టణానికి చెందిన పలువురు విరాళాలు అందించగా ఆలయ నిర్మాణం చక్కగా నిర్వహించారు. ఆలయ నిర్మాణాలు పూర్తి అయిన తరువాత కుంభాభిషేకం నిర్వహించారు. ఆలయంలో అమ్మవారికి పూజలు నిర్వహించారు. శుక్రవారం ఉదయం 6గంటలకు అమ్మవారి విగ్రహ ప్రతిష్ట జరుపుతారు. తరువాత ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నారు. ఆలయనిర్మాణానికిగ్రామానికిచెందిన14మందితోకొత్త కమిటిని ఏర్పాటు చేసుకొని నిర్మించారు.

పాఠశాల ఎస్ఎంసి ఛైర్మన్‌గా విమల

శ్రీకాళహస్తి, ఆగస్టు 8 ప్రభాతవార్త

పట్టణంలోనిని ఆర్‌పిబిఎస్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం పాఠశాల యాజమా న్య కమిటీ ఎన్నికలనుజిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల్లో ఛైర్మన్‌గా కె. విమల ఏకగ్రీవంగా ఎన్నికవగా, వైస్ ఛైర్మన్‌గా రాజాలతో పాటు ఎక్స్ అఫిషియో సభ్యులుగా ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి, కె. శ్రీనివాసులు, భూ దేవి, పి. ధనలక్ష్మి, వరలక్ష్మి, కో ఆప్టడ్ సభ్యులుగా డి. లావణ్య, సి. శివకుమార్ తదితరులను ఎన్నుకు న్నారు. అనంతరం నూతన కమిటీని ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌లను పట్టణ బిసి నాయకుడు పోలూరు శ్రీనివాసులురెడ్డి, వెంకటరమణ, మోహన్‌గౌడ్, కెవి. ప్రతాప్, ఎంఎస్‌రెడ్డి, ఆర్యుగం, దొరబాబు, నాగరాజ, మురళీ, మునిరాజ, శివారెడ్డి, మునిసుబ్బారెడ్డి, రాజేందర్ బి. రూకేష్, ఎస్‌కె. షఫి టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రశాంతంగా స్కూలు మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు

వడమాలపేట, ఆగస్టు 8 ప్రభాతవార్త:

స్కూలు మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు గురువారం వడమాలపేట మండలంలో ప్రశాంతంగా జరిగాయి. వడమాలపేట బాలికల ఉన్నత పాఠశాల మినహా మిగిలిన అన్ని పాఠశాలలో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 32 ప్రాథమిక, ఐదు ప్రాథమికోన్నత, ఆరు ఉన్నత పాఠశాలల్లో నూతన కమిటీల ఎన్నిక ప్రక్రియ పూర్తయినట్లు ఎంఈవోలు పద్మావతి, తులసిరామ్‌లు తెలిపారు. వడమాలపేట బాలుర ఉన్నత పాఠశాలకు షబ్బీర్, బాలికల పాఠశాలలో సుబ్రహ్మణ్యం, తడుకు ఆర్ఎస్ హైస్కూలులో నరసింహులు యాదవ్, శ్రీ బొమ్మరాజపురంలో గీత, సీతారామపురం హైస్కూలులో మహాలక్ష్మి, పత్తి పుత్తూరు హైస్కూలుకు వెంకటమునిలు చైర్మన్‌లుగా ఎన్నికయ్యారు. ప్రధానోపాధ్యాయులు నూతన కమిటీచే ప్రతిజ్ఞ చేయించి మొదటి సమావేశాన్ని నిర్వహించారు.

మృతి చెందిన కుటుంబ బాధితులను పరామర్శించిన రోజా

నిండ్ర, ఆగస్టు 8 ప్రభాతవార్త :

మండలంలోని జియన్ కండ్రిగ వైయస్ఆర్ కాంగ్రెసు పార్టీ నాయకులు మధు తల్లి కోనమ్మ మృతి చెందిన కుటుంబాన్ని మాజీ మంత్రివర్యులు ఆర్‌కె రోజా గురువారం పరామర్శించినారు. ఈసందర్భంగా ఆర్‌కె రోజా కోనమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించినారు. ఆతరువాత వైయన్ కండ్రిగ గ్రామంలో నివాసము యుండు వైయస్ఆర్ కాంగ్రెసు పార్టీ కార్యకర్త పవన్‌కమార్ ఇటివల కాలంలో రోడ్ యాక్సిడెంట్‌లో గాయాలు పాలై ఆసుపత్రిలో చికిత్స పొంది తన ఇంటి నందు విశ్రాంతి తీసుకుంటున్న పవన్ కుమార్‌ను ఆర్‌కె రోజా పరామర్శించినారు. ఈకార్యక్రమంలో యంపిపి దీపాజ లంధర్‌రాజు, మండల వైకాపా కన్వీనర్ వేణురాజు, నాయకులు శ్యామ్‌లాల్, అనిల్, విజేష్, తిరుమలరెడ్డి, శివలింగంఆచ్చారి, సత్యరాజ్, సూర్య, వీరయ్యనాయుడు, బాబురెడ్డి, చార్లీ, రాజేష్ పాల్గొన్నారు.

13న సాధారణ సర్వసభ్య సమావేశం

పుత్తూరురూరల్, ఆగస్టు 8 ప్రభాతవార్త: ఈ నెల 13న స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పుత్తూరు మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఇందిరమ్మ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి నియోజకవర్గ శాసన సభ్యులు, ఎంపీ, శాసన మండలి సభ్యులకుసమాచారం అందించామన్నారు. ఈ సమావేశానికి మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కో–ఆప్షన్ మెంబరు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వారి ప్రగతి నివేదికలతో తప్పక హాజరు కావాలని పేర్కొన్నారు.

ప్రశాంతంగా పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు

పుత్తూరురూరల్, ఆగస్టు 8 ప్రభాతవార్త: పుత్తూరు మండలంలో పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసినట్లు ఎంఈవో తిరుమలరాజు తెలిపారు. మండలంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో 80 వరకు ఉన్నాయన్నారు. అందులో 65 పాఠశాలకు ఏకగ్రీవంగా ఎన్నికలు జరగగా 15 పాఠశాలల్లో ఓటింగ్ ద్వారా తల్లిదండ్రుల కమిటీలను ఎన్నుకున్నట్లు ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో ఎంఈవో బాలసుబ్రహ్మణ్యం, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. అలాగే పుత్తూరు పట్టణంలోని గేట్ పుత్తూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రులు పాల్గొని పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు నిర్వహించారు. పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికల్లో ఎన్.పి. శంకర్ పాఠశాల యాజమాన్య కమిటీ ఛైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే వైస్ ఛైర్మన్‌గా ఎం. సలోమి ఎన్నికైంది. ఈ కార్యక్రమంలో ఎంఈవో తిరుమలరాజు పాల్గొని పాఠశాల యాజమాన్య కమిటీ బాధ్యతలను గురించి వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వేములు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. అలాగే పుత్తూరు రూరల్ మండలం గొల్లపల్లి జడ్పీ పాఠశాలలో యాజమాన్య కమిటీ ఎన్నికలు గురువారం ఏకగ్రీవంగా జరిగాయి. కమిటీ చైర్మన్‌గా ముని శ్రీనివాసులు, వైస్ ఛైర్మన్‌గా గీతలు ఎన్నికయ్యారు. మొత్తం 24 మంది సభ్యులు ఉంటే అందరూ ఆమోదం తెలిపారు. అనంతరం కమిటీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌లను తెలుగుదేశం పార్టీ చిత్తూరు జిల్లా ఉపాధ్యక్షుడు గంజిమాధవయ్య పూలమాలలు, శాలువలతో ఘనంగా సన్మానించారు.

ప్రశాంతంగా స్కూలు మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు

కేవీబీ పురం , ఆగస్టు 8 ప్రభాతవార్త: స్కూలు మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు గురువారం కేవీబీ పురం మండలంలో ప్రశాంతంగా జరిగాయి. అన్ని పాఠశాలలో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల పెరిందేశం దళితవాడ, కేవీబీ పురం పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి. వెంకటయ్య ఆధ్వర్యంలో కమిటీ చైర్‌పర్సన్‌గా వి. సుప్రీయ, వైస్‌చైర్మన్‌గా కె. సంపత్‌ను కమిటీసభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందన్నారు. అలాగే ఆదర్శ పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ ఎన్నికల్లో సత్యవేడు నియోజకవర్గ ఎమ్మెల్యే ఆదిమూలం ఆదేశాల మేరకు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు రామాంజులనాయుడు, తిరుపతి పార్లమెంట్ రైతు అధ్యక్షుడు గోపినాథ్‌రెడ్డి, టీఎన్‌టీయూసీ జయరాంరెడ్డి నాయకుల చొరవతో ఎస్ఎంసీ చైర్మన్‌గా ఎన్నికైన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు అవసరం సురేష్‌రెడ్డి కొత్తగా ఎన్నికైన ఎస్ఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్ సంధ్యకి కేవీబీ పురం మండలం తెలుగుదేశం పార్టీనాయకులు, కార్యకర్తలు వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఐటీడీపీ అధ్యక్షుడు వినీత్, తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా గ్రామాల్లో పిచ్చి మొక్కల తొలగింపు

విజయపురం, ఆగస్టు 8 ప్రభాతవార్త: మండలంలోని నారపరాజు కండ్రిగ, శ్రీహరిపురం, కేవీ పురం ఇంకా పలు గ్రామాల్లో పారిశుధ్య పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ పనులను ఎంపీడీవో ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శులు ఆయా పంచాయతీల్లో గ్రామాల పరిధిలో వీధులకు ఇరువైపులా, ఓవర్‌హెడ్ ట్యాంకుల వద్ద ఏపుగా పెరిగిపోయిన పిచ్చి మొక్కలను జేసీబీతో తొలగిస్తున్నారు. మంచినీటి చేతి పంపుల వద్ద నీటి కొళాయిల వద్ద పేరుకుపోయిన మురుగును తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్నారు. గ్రామాల సమీపంలోని పేడ దిబ్బలను కూడా తొలగిస్తున్నారు. ప్రతి ఒక్కరికి పారిశుధ్యంపై అవగాహన కల్పిస్తున్నారు.

రామాలయ పున: నిర్మాణాన్ని అడ్డుకున్నవారిపై చర్యలు తీసుకోవాలి

– రామాలయం పున:నిర్మాణానికి సహకరించకపోతే అందోళన చేస్తాం

తిరుపతిరూరల్, ఆగస్టు 8 ప్రభాతవార్త:

కాలూరులో రామాలయ పున:నిర్మాణాన్ని అడ్డుకుంటున్నవారిపై చర్యలు తీసకుని, రామాలయం నిర్మాణానికి సహకరించాలని స్థానికులు డిమాండ్ చేసారు. రామాలయం నిర్మాణాన్ని అడ్డుకుంటే ఆందోళన కార్యక్రమాలు చేస్తామని స్థానిక మహిళలు స్పష్టం చేసారు. తిరుపతిరూరల్ మండలం సి. మల్లవరం గ్రామ పంచాయతీ పరిధిలోని కాలూరు క్రాస్‌లో శిధిలావ్యస్థకు చేరుకున్న పురాతన ఆలయాన్ని తొలగించి, నూతన ఆలయాన్ని నిర్మిస్తుంటే ఆలయానికి పడమరగా ఇళ్లు నిర్మాణం చేసుకునే సుబ్రమణ్యం అనే వ్యక్తి అడ్డుపడుతున్నాడని ఆవేదన వ్యక్తం చేసారు. వంద సంవత్సరాలు చరిత్ర కలిగిన ఆలయాన్ని తొలగించి, ఆ స్థానంలో నూతన ఆలయాన్ని పున:నిర్మాణ పనులు ఆపడం దుర్మార్గమని పేర్కొన్నారు. ఈ విషయమై స్థానిక ఎమ్మెల్యే పులివర్తి నాని దృష్టికి తీసుకెళ్ళగా, మీరు నాకు ఓట్లు వేయలేదు, నేను ఎందుకు మీకు సహకరించాలని నిర్మొహమాటంగా చెప్పారని, మేము అందరం ఓట్లు వేస్తేనే నాని గెలిచాడనే విషయాన్ని గుర్తించుకోవాలని నాగరత్న అనే మహిళ ఎమ్మెల్యేపై ఆగ్రహం వ్యక్తం చేసారు. ప్రజా సమస్యలపై స్థానిక ఎమ్మెల్యే స్పందించి, ఆలయ పున:నిర్మాణానికి సహకరించాలని కోరారు.

రేషన్‌షాపు డీలర్లకు మంచి రోజులొచ్చాయి

–యండియు రద్దుపై సర్వత్ర ఆనందం వ్యక్తం చేస్తున్న డీలర్లు

–రాష్ట్ర ముఖ్యమంత్రి బ్యానర్‌కు పాలాభిషేకం చేసిన రేషన్ డీలర్లు

తిరుపతిరూరల్, ఆగస్టు08 ప్రభాతవార్త:

ఇంటింటికి రేషన్ సరఫరా చేసే యండియు వ్యవస్థను రద్దు చేసి, డీలర్లకు పూర్వ వ్యవస్థను కొనసాగిస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చెప్పడంపై రేషన్ డీలర్లలో నూతన ఉత్సాహం ఉప్పొంగింది. రేషన్ డీలర్లు నష్టం కలిగిలే గత వైకాపా ప్రభుత్వం వ్యవహరించిందని, లబ్దిదారుల ఇళ్ల వద్దకే నిత్యవసర వస్తువుల సరఫరా చేసే పక్రియలో అనేక ఆటంకాలు కలిగాయని, పంపిణి సక్రమంగా జరగలేదని డీలర్లు ఆవేదన వ్యక్తం చేసారు. రేషన్ సరఫరా వ్యవస్థపై రాష్ట్ర ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు డీలర్లు తెలిపారు. ఈ మేరకు గురువారం స్థానిక ఏఎస్ఓ కార్యాలయం ముందు ముఖ్యమంత్రి బ్యానర్‌కు పాలాభిషేకం చేసారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్స్ తిరుపతిరూరల్ అధ్యక్షుడు మునికృష్ణారెడ్డి, గుత్తా కోటేశ్వరనాయుడు మాట్లాడుతూ రేషన్ షాపు డీలర్లకు కూటమి పూర్వవైభవం తీసుకురావటం సంతోషమని, అలాగే డీలర్ల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేసారు. రేషన్ డీలర్స్ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు లీల మాధవరావు ఆదేశాల మేరకు ఈరోజు ఆయా సివిల్ సప్లై కార్యాలయాలు వద్ద ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. రేషన్ డీలర్లు, హేమలత, సాల్మన్‌రాజ్, శివారెడ్డి, రామకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యల పరిష్కారంలో భాగస్వాములు కావాలి

శ్రీకాళహస్తిరూరల్, ఆగస్టు 8 ప్రభాతవార్త శ్రీకాళహస్తి నియోజకవర్గం ఎర్రేడు మండలం మేర్లపాకకు చెందిన తోటకూర కోటేశ్వరరావు రాష్ట్ర స్థాయి ఉద్యోగ సంఘాల నాయకుడుగా ఎంపిక కావటం తమ గ్రామానికే తలమానికంగా ఉందని గురువారం గ్రామ సర్పంచ్ గంగాధరం అన్నారు. రాష్ట్ర సచివాలయ ఉద్యోగ సమాఖ్య అధ్యక్షులుగా మేర్లపాక గ్రామానికి చెందిన తోటకూర కోటేశ్వరరావు ఎంపికయ్యారు. కోటేశ్వరరావు మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి తనను రాష్ట్ర ఉద్యోగ సంఘ నాయకునిగా ఎన్నుకున్నారన్నారు. సర్పంచ్ సారధ్యంలో కోటేశ్వరరావును ఘనంగా సత్కరించారు. గ్రామ సర్పంచ్ గంగాధరం, ఏర్పేడు ప్రాధేశిక సభ్యుడు మెరుం భరత్ శంకరయ్య, మాజీ వైస్ సర్పంచ్ చింతవెంకటరమణయ్య, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి డివిజన్

చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానికి ఘన స్వాగతం

పాకాల, ఆగస్టు 8, ప్రభాతవార్త పాకాల మండలంలోని ఒడ్డేపల్లి పంచాయితీ, బొల్లినేని రామ య్య గారి పల్లిలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామస్తులు కలిసి పులివర్తి నాని చంద్రగిరి ఎమ్మెల్యేగా భారీ మెజారిటీతో గెలుపొందిన సందర్భంగా ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ ఆత్మీయ సమావేశానికి చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానిని ఆహ్వానించారు. గ్రామానికి చేరుకున్న తమ నాయకుడిని మంగళవాయిద్యాలతో, శాలువా కప్పి, గజమాలలతో ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా కలిసి పనిచేద్దాం, గ్రామాల అభివృద్ధికి కృషి చేద్దాం అంటూ గ్రామస్తులకు పిలుపునిచ్చారు. త్రాగు నీరు, సైడ్ కాలువలు, బోర్లు, శుభ్రత వంటి సమస్యలపై మొదటగా పరిష్కరించడం జరుగుతుందని అన్నారు.

ప్రశాంతంగా ముగిసిన పాఠశాల ఎన్నికలు

పాకాల, ఆగస్టు 8, ప్రభాతవార్త మండలంలోని 59 ప్రాథమిక, 4 ప్రాథమికోన్నత, 6 ఉన్నత పాఠశాలల్లో పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయని తిరుపతి జిల్లా పాకాల మండల విద్యా శాఖాధికారి బాబ్జి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని ప్రభఉత్వ పాఠశాలల్లో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు తల్లిదండ్రుల కమిటీ కొరకు ఎన్నికలు జరగాయని అన్నారు. ఈ ఎన్నికల్లో ఎక్కడ గానీ అవాంచనీయ సంఘటనలు జరగలేదని పేర్కొన్నారు. ప్రతి పాఠశాలలోను కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని అన్నారు. ఎన్నికైన సభ్యులు అందరూ ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయుల చేత ప్రమాణం చేశారు. వీరందరూ రెండు సంవత్సరాలు పదవిలో ఉంటారని పేర్కొన్నారు. ప్రతి పాఠశాల యొక్క కమిటీ పోటోలను దానికి సంబంధించిన లింక్ నందు అప్లోడ్ చేయడం జరి

విద్యాకమిటీ ఎన్నికల్లో అధికారపక్షం హవా

- 80 పాఠశాలల్లో ఛైర్మన్, వైస్‌ఛైర్మన్ల కైవసం - వాయిదాపడిన యాకసిరి జడ్పీ హెచ్ఎస్ ఎన్నిక- సత్తాచాటిన కన్వీనర్ కిషోర్‌నాయుడు

ఉన్నత పాఠశాల ఎస్ఎంసి ఎన్నికల్లో ఛైర్మన్, కోఛైర్మన్లతో టిడిపి కన్వీనర్

చిట్టమూరు, ఆగస్టు ప్రభాతవార్త : గురువారం నిర్వహించిన ఎస్ఎంసి ఎన్నికల్లో అధికారపక్షం మద్దతుదారులు పూర్తిస్థాయిలో తమ ఆధిపత్యాన్ని ప్రదర్శించారు. చిట్టమూరు మండలంలోని 23 పంచాయతీల పరిధిలో 82 పాఠశాలల్లో నిర్వహించిన విద్యాకమిటీ ఎన్నికలకు సంబంధించి 80 పాఠశాలల్లో అధికార పార్టీ మద్దతుదారులు ఎస్ఎంసి ఛైర్మన్, వైస్ ఛైర్మన్ పదవులను దక్కించుకున్నారు. అయితే మండల వైసీపీ కన్వీనర్ సన్నారెడ్డి శ్రీనివాసులురెడ్డి స్వగ్రామమైన యాకసిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్ఎంసి ఎన్నిక వివాదాస్పదంగా మారడంతో వాయిదా పడింది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్నికను సజావుగా నిర్వహించాల్సిందిపోయి వైసీపీకి కొమ్ముకాయడం వల్ల అధికారపక్షం ఎన్నికను బహిష్కరించింది. విద్యార్థుల తల్లిదండ్రులు సైతం ప్రధానోపాధ్యాయుడి ఏకపక్ష నిర్ణయాలతో వాగ్వివాదం జరిపి వారి చర్యలను ఎండగట్టడంతో మరోమారు తల్లిదండ్రులను సమావేశ పరిచి ఎన్నిక నిర్వహిస్తామని హెచ్ఎం చెప్పారు. ఎన్నికకు రెండురోజులు ముందే తల్లిదండ్రులకు తెలిపి సక్రమంగా నిర్వహించాలని ప్రధానోపాధ్యా యుడికి చెప్పడంతో పరిస్థితి సర్దుమణిగింది. ఇదిలావుంటే విద్యాకమిటీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న మండల కన్వీనర్ గణపర్తి కిషోర్ నాయుడు రెండురోజులకు ముందే పార్టీ నాయకులకు దిశానిర్దేశం చేయడం, ప్రతిపక్ష నాయకులు పత్తాలేకపోవడంతో 98శాతం మేరకు ఫలితాలు టిడిపి రాబట్టడంతో మండలంలో సంబరాలు నెలకొన్నాయి. ఏదిఏమయినా విద్యా కమిటీ ఎన్నికలను గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ సూచనల మేరకు ప్రతిష్టాత్మకంగా తీసుకున్న టిడిపి శ్రేణులు అందుకు తగ్గ ఫలితాలు రాబట్టడంతో సఫలీకృతమయ్యారని చెప్పవచ్చు.

ప్రశాంతంగా జరిగిన విద్యా కమిటీ ఎన్నికలు

గెలిచిన వారితో ప్రమాణం చేస్తున్న దృశ్యం

బాలాయపల్లి, ఆగస్టు 8 ప్రభాతవార్త : మండలంలో 69 పాఠశాలలకు గాను 68 పాఠశాలలకు స్కూల్ మేనేజ్మెంట్ ఎన్నికలు జరిగినట్లు ఎంఈవో కిల్లా వెంకటేశ్వర్లు తెలిపారు. గొట్టికాడు ఎస్సి కాలనీలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో స్కూల్ మేనేజ్మెంట్ ఎన్నిక జరగలేదని ఎంఈవో తెలిపారు. అన్ని పాఠశాలల్లో ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌లను మొత్తం 136 మందిని తల్లిదండ్రులు చేతులెత్తి ఎన్నుకున్నట్లు ఆయన వివరించారు. జయంపు ఉన్నత పాఠశాల ఛైర్మన్‌గా జె. వెంకటేశ్వర్లు, వైస్ ఛైర్మన్‌గా పి. రేవతిలు ఎన్నికయ్యారు. వెంగమాంబ పురం జడ్పి ఉన్నత పాఠశాలలో ఛైర్మన్ మంగళపూరి గంగాధర్, వైస్ ఛైర్మన్ వి. జ్యోతిలు ఎన్నికయ్యారు. జయంపు ఉన్నత పాఠశాల ఛైర్మన్‌గా జె. వెంకటేశ్వర్లు, వైస్ ఛైర్మన్‌గా పి. రేవతి ఎన్నిక కావడంతో అభినందించిన మాజీ సొసైటీ అధ్యక్షులు విందోటి కార్తిక్ రెడ్డి వైస్ ఛైర్మన్లగా బాలయ్యపల్లిలో ఏ వెంకటాద్రి, పి. స్వరూపా, ఎంసి కండ్రికలో ఎ. రమణయ్య, బి. కోటేశ్వరి, జయంపు ప్రాథమిక పాఠశాలలో వినోద్, జి. వనమ్మ, ఎస్సి కాలనీలో బి. రమణమ్మ, జి. సునీత, సంఘవరం ప్రాథమిక పాఠశాలలో పూసల దివ్య, తుపాకుల చెంచయ్య, కడగుంట ఉన్నత పాఠశాలలో ఆర్కాటి చెంచమ్మ దేవసేనమ్మ, నిడిగళ్ళులో చప్పిడి శ్రీనివాసులు రెడ్డి ఎన్నికయ్యారు. కడగుంట, కామకూరు, జయంపు గ్రామాల్లో ఎన్నికలు కొద్ది సేపు ఎన్నికలు ఆగాయి. కొంతమంది తల్లిదండ్రులు ఎన్నికలు తమకు వద్దంటూ మధ్యలో వెనుతిరిగారు. ప్రధానోపాధ్యాయులు డిప్యూటీ డిఇఓ, ఎంపిడిఓ, పోలీసులకు, ఎంఈఓలకు చరవాణి ద్వారా ఫిర్యాదు చేశారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి ఎన్నికలు సజావుగా జరిగేలా చూసారు.

మళ్లీ అదే భారీ పేలుడు శబ్దం .. ఉలిక్కిపడ్డ జనం

కుప్పం, ఆగస్టు 8 ప్రభాతవార్త : కుప్పం ప్రాంతంలో గురువారం ఉదయం పదకొండు గంటల ప్రాంతంలో భారీ పేలుడు శబ్దం రెండుసార్లు రావడంతో జనం భయాందోళనలకు గురయ్యారు. ఒక్కసారిగా పేలుడు శబ్దాలు రావడంతో పలు ప్రాంతాల్లో జనం ఇళ్లనుంచి బయటకు పరుగులు తీశారు. కాగా తమిళనాడు రాష్ట్రం హోసూరు వద్ద ఉన్న ఆర్మీ బేస్ క్యాంప్‌లో సైనికులకు శిక్షణ ఇచ్చే సందర్భంగా ఇలా ఎయిర్ బ్లాస్ట్‌లు చేపడుతుంటారని దాదాపుగా ఈ పేలుళ్లు అవే ఉంటాయని పోలీసులు తెలిపారు.

కిడ్నీ డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేస్తా : ఎమ్మెల్యే

వెంకటగిరి, ఆగస్టు 8 ప్రభాతవార్త : ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసీస్ కేంద్రాన్ని త్వరలో ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. వెంకటగిరి ప్రభుత్వ ఆసుపత్రిని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. కిడ్నీ డయాలసిస్ కేంద్రం ఏర్పాటుకు ఆసుపత్రిలో అన్ని వసతులు ఉన్నాయని చెప్పారు. కిడ్నీ వ్యాధిగ్రస్తులు డయాలసీస్ కోసం నెల్లూరు వెళ్లాల్సి వస్తుందని చెప్పారు. గుండెపోటు వచ్చిన వారికి నివారించేందుకు 50 వేల రూపాయిల విలువ కలిగిన ఇంజక్షన్‌ను ఉచితంగా ఆసుపత్రిలో వేస్తారని తెలిపారు. వైసిపి ప్రభుత్వం ఆసుపత్రులను నిర్వీర్యం చేసిందని విమర్శించారు. గత ప్రభుత్వంలో రోగులకు వైద్యం అందక ఇబ్బందులు పడ్డారని ఆయన తెలిపారు. ఆసుపత్రిలో ఫిజియోథెరపిస్టు అందుబాటులో లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆసుపత్రిలో అన్ని విభాగాలను ఆయన పరిశీలించారు. ఆయన వెంట డాక్టర్ జిలాని భాష, టిడిపి రాష్ట్ర కార్యదర్శి జి. నాగేశ్వర రావు, మాజీ ఏఎంసి ఛైర్మన్ కులకొల్లు రాజేశ్వరరావు, రాష్ట్ర తొలి యువత కార్యదర్శి కెవికె ప్రసాద్ నాయుడు, మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ రాజేశ్వర రావు, అధ్యక్షుడు పవ్వు చంద్రమౌళి రెడ్డి తదితరులు ఉన్నారు.

నీలకంఠేశ్వరస్వామి దేవస్థానంలో విగ్రహ పునఃప్రతిష్ఠ

పెళ్లకూరు, ఆగస్టు 8 ప్రభాతవార్త : పెళ్లకూరు మండలం చెంబేడు గ్రామంలో పురాతన కాలం నుంచి నెలకొని ఉన్న నీలకంఠేశ్వరస్వామి దేవస్థానంలో విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమం వైభవంగా జరిగింది. పురోహితుడు రాజు వైదేశ్వరన్‌శర్మ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా ఈ కార్యక్రమం జరిగింది. నూతనంగా నిర్మించిన ఆలయాన్ని విద్యుదీపాలంకరణలు చేశారు. గ్రామంలోని భక్తులు, ప్రజలు నియమనిష్టలతో స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి హారతులు పట్టారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో లాయర్ ప్రభాకర్‌రెడ్డి, బెల్లపు వెంకటరాఘవరెడ్డి, తుమ్మూరు మహేష్‌రెడ్డి, మహేంద్రరెడ్డి, శేషయ్య, వంశీరెడ్డి, జనార్ధనాచారి, చిరంజీవులు ఆచారి, యోగేశ్వరరావు, గోపి, చినగంగయ్య, శ్రీపురం మునిరాజా, శివయ్య, మునికృష్ణయ్య, రాజా, గిరి, కమలాకర్‌రావు, చంద్రయ్య, మారాబత్తిని ఈశ్వరయ్య తదితరు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన పోలేరమ్మ జాతర

- పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే విజయశ్రీ

తడ, ఆగస్టు 8 ప్రభాతవార్త : గత ఏడాది సరిగ్గా ఇదే సమయంలో తీవ్ర ఉద్రిక్తతల మధ్య జరిగిన తడ మండలం కారూరులోని పోలేరమ్మ జాతర ఈ సారి ప్రశాంతంగా ముగిసింది. రెండురోజుల పాటు ఇక్కడ ఉత్సవాలు నిర్వహించారు. ఆంధ్రా, తమిళనాడు సరిహద్దుల్లో ఉన్న ఈ గ్రామంలో గతంలో పలుమార్లు జాతర సందర్భంగా ఘర్షణలు చోసుకునేవి. గత ఏడాది ఏకంగా 40 మంది పోలీసులతో బందోబస్తుతో జాతర జరపాల్సి వచ్చింది. ఈ సారి గ్రామపెద్దలంతా చర్చించి గొడవలు లేకుండా ప్రశాంతంగా జాతరను జరిపారు. పొంగళ్లు పెట్టుకొని ఊరేగింపుగా గ్రామశక్తి ఆలయానికి చేరుకొని పూజలు చేశారు. బుధవారం జరిగిన మొదటి రోజు పూజలు ప్రశాంతంగా జరిగితే, గురువారం ఈ కార్యక్రమానికి సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ సైతం హాజరయ్యారు. ఆమె కూడా భక్తిశ్రద్ధలతో జాతరలో పాల్గొని గ్రామస్థులతో ముచ్చటించి వెళ్లారు. మండల టిడిపి అధ్యక్షుడు కామిరెడ్డి మురళీరెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

జెండా పండుగకు ఊరు మొత్తం ఏకత్రాటిపై

పుంగనూరు,ఆగస్టు 8 ప్రభాతవార్త : స్వాత్ర ంత్య, గణతంత్ర దినోత్సవాలను ఇకపై ఎవరికి వారే కాకుండా ఊరు ఊరంతా ఒక్కటిగా నిర్వహించుకోవాలని, వందల మీటర్ల పొడవుగల ఒకే జెండాను చేతపట్టాలని పుంగనూరు యువజనం నిర్ణయించింది. ఈమేరకు ఊరులోని అన్ని సంఘాలు, పార్టీలు, మతాలు, కులాల,సేవా సంస్థల నిర్వాహకులందరూ శుక్రవారం కొత్తఇండ్లులోని సాయిబాబా ఆలయ కమ్యునిటీ హాల్‌లో సమావేశం కావాలని నిర్ణయించారు. ఎపుడూ ప్రజాసేవకు ముందుండే లయన్స్, రోటరీ, హిందూసత్యధర్మ దివ్యజా ్ఞన జ్యోతి,సంస్థలతో పాటూ బిజెపి మరిన్ని పార్టీలు ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవాన్ని వైభవంగా నిర్వహించడానికి ముందకు వచ్చాయి. ఈమేరకు పట్టణంలో కులమత, పార్టీ, వర్గ, విచక్షణ లేకుండా అందరూ ఒక్కటిగా నిలబడి అతిపెద్ద ర్యాలీ నిర్వహించాలని, దేశమాత పండుగను నిర్వహించుకోడానికి భేషజాలు వదలి శుక్రవారం సమావేశానికి రావాలని సూచించారు. రాజారెడ్డి, త్రిమూర్తిరెడ్డి,వెంకటేష్,ముత్యాలు,టివిఎస్ ప్రసాద్, నారాయణరెడ్డిలతో పాటూ పలువురు పాల్గొన్నారు.

గణనాధుని సన్నిధిలో సినీ నటుడు సంతోష్ శోభన్

కాణిపాకం, ఆగస్టు 8 ప్రభాతవార్త: తెలుగు సినీ నటుడు సంతోష్ శోభన్ గురువారం కుటుంబ సమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ సూపరెండెంట్ కోదండపాణి, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. వారికి వేదమండపంలో వేదాశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను, చిత్రపటాన్ని అందజేశారు. అలాగే శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా వారు పూజలు నిర్వహించారు.వారి వెంట టెంపుల్ ఇన్స్‌పెక్టర్ విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

వైదులు అందుబాటులో వుండి సమయపాలన పాటించాలి : డిఎంహెచ్ఓ

చౌడేపల్లి, ఆగస్టు 8 ప్రభాతవార్త : ఆరోగ్య కేంద్రాల్లో వైద్యాధికారులు రోగులకు అందుబాటులో వుండి సమయపాలన పాటించాలని జిల్లా ఆరోగ్యాధికారిణి ఓ ప్రభావతి హెచ్చరించారు. మండలంలోని చౌడేపల్లి, లద్దిగం ఆరోగ్య కేంద్రాలను డిఎంహెచ్ఓ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆరోగ్య కేంద్రాల పరిసరాలను శుభ్రంగా వుంచుకోవాలన్నారు. దయేరియా, మలేరియా వ్యాధులు ప్రబలుతున్న ప్రస్తుత సమయంలో గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య చర్యలు క్రమం తప్పకుండా పాటించాలన్నారు. దోమలు వృద్ధి చెందకుండా పంచాయతీల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైన చోట్లలో ఫాగింగ్ చేయాలన్నారు. జిల్లాలో 150డెంగీ, 17చికున్ కేసులు నమోదు అయ్యాయని ఒక ప్రశ్నకు సమాధాన మిచ్చారు. ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. వైద్యాధికారులు సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. అదే విధంగా ఆదివారాల్లోనూ మధ్యాహ్నం వరకు వైద్యాధికారులు అందుబాటులో వుండాలన్నారు. చౌడేపల్లి ఆరోగ్య కేంద్రంలో శిథిలావస్థలో వున్న భవనాల తొలగింపుకు చర్యలు తీసుకొంటామన్నారు. అనంతరం పలు రికార్డులను తనిఖీ చేసారు. నోడల్ అధికారి శిరీష్, వైద్యాధికారులు పూజ, అనిల్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పిఎం విశ్వకర్మ యోజన లబ్ధి కోసం రిజిస్ట్రేషన్లు : కలెక్టర్

చిత్తూరు, ఆగస్టు 8 ప్రభాతవార్త: ఎంపి విశ్వకర్మ యోజన ద్వారా లబ్ధి పొందడానికి గ్రామ/వార్డు సచివాలయాలు, సిఎస్‌సి సెంటర్ల నందు రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల పిఎం విశ్వకర్మ యోజన ప్రారంభించిందని, కేవలం 5 శాతం వడ్డీకే రూ.3 లక్షల వరకు రుణం అందించే ఈ పథకం 2023 సెప్టెంబర్ 17న ప్రధాని నరేంద్రమోడి ప్రారంభించారన్నారు. సంప్రదాయ వృత్తులు చేసే, చేతి వృత్తుల్లో పని చేసే వెనుకబడిన వర్గాల కోసం పిఎం విశ్వకర్మ స్కీమ్ పేరిట 15 వేల కోట్ల రూపాయలు కేటాయించడం జరిగిందన్నారు. ఈ పథకం 2023-24 నుండి 2027-28 వరకు ఐదేళ్ళ పాటు అమలులో వుంటుందన్నారు. గురు-శిష్య వారసత్వ పరంపరను ప్రోత్సహించి సంప్రదాయ పనిముట్లను, చేతులను ఉపయోగించి పని చేసే కళాకారుల కుటుంబ ఆధారిత వృత్తులను బలోపేతం చేయడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశమన్నారు. చేతి పనుల వారు, కళాకారులు చేసే ఉత్పత్తుల నాణ్యతను పెంచడం, వారిని దేశీయ, గ్లోబల్ మార్కెట్‌తో అనుసంధానం చేయడం ఈ పథకం ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ పథకం ద్వారా కళాకారులు, చేనేత కార్మికులకు పిఎం విశ్వకర్మ సర్టిఫికేట్‌తో పాటు గుర్తింపు కార్డు అందిస్తారని, కేవలం 5 శాతం వడ్డీతో తొలి విడత రూ.1 లక్ష వరకు రెండవ విడత రూ.2 లక్షలు అందిస్తారన్నారు. ఇతర రుణాలతో పోల్చితే ఇది తక్కువ వడ్డీ వుంటుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని కళాకారులు, చేతి వృత్తుల వారికి ఈ స్కీము వరిస్తుందని, 18 సంప్రదాయ వృత్తులైన వడ్రంగి, స్వర్ణకారులు, కుమ్మరి, కమ్మరి, శిల్పులు, రాతి పని చేసేవారు, చెప్పులు తయారు చేసేవారు, మేసన్, తాపి పని, బుట్టలు, చాపలు, చీపుర్లు, తాళ్ళు అల్లేవారు, సంప్రదాయకంగా బొమ్మలు తయారు చేసేవారు, క్షురకులు, పూలదండలు చేసేవారు, లాండ్రి, టైలర్, చేపల వలలు తయారు చేసేవారు, సుత్తి-పనిముట్లు తయారు చేసేవారు, తాళాలు తయారు చేసేవారికి ఈ పథకం వర్తిస్తుందన్నారు.

కుప్పం ఆర్టీసీ డిపోను ఆదర్శ డిపోగా తీర్చిదిద్దుతాం

ఎమ్మెల్సీ,సమన్వయకమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్

కుప్పం, ఆగస్టు 8 ప్రభాతవార్త : సిఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలతో కుప్పం ఆర్టీసీ డిపోను రాష్ట్రంలోనే ఆదర్శ డిపోగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్సీ,సమన్వయకమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. గురువారం స్థానిక డిపోలో కుప్పం-తిరుపతి మధ్య తిరిగే నూతన ఆర్టీసీ బస్సును పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఆయనమాట్లాడుతూ సిఎం చంద్రబాబు ఆదేశాలతో కుప్పం ఆర్టీసీ డిపోను ఇప్పటికే ప్రక్షాళన చేశామన్నారు. ఇప్పటికే పలు నూతన బస్సులు ప్రారంభించా మన్నారు. త్వరలో ఎలక్ట్రిక్ బస్సులు తీసుకువస్తామని పేర్కొన్నారు. కుప్పం బస్‌స్టేషన్‌ను మోడల్ బస్‌స్టేషన్‌గా మార్చేందుకు ప్రణాళికలు సిద్ధమవుతున్నట్లు తెలిపారు. అనంతరం స్థానిక శ్రీ తిరుపతి గంగమ్మ ఆలయం దాకా ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్ స్వయంగా నూతన బస్సును నడిపారు. కార్యక్రమంలో డిఎం పెంచలయ్య, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, సిఎంఎ నరసింహులు, బలరాం, కౌన్సిలర్లు జిమ్‌దాము, జాకీర్, నేతలు డా॥ వెంకటేష్, సత్యేంద్రశేఖర్, శాంతారాం, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

శివయ్య సేవలో కేంద్ర మంత్రి

శ్రీకాళహస్తి,ఆగస్టు 8 ప్రభాతవార్త : దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురువారం రాహుకాల సమయంలో ఎక్స్ అఫిషియో క్యాబినెట్ మంత్రి రాజేశ్వరప్రసాద్ కుటుంబ సభ్యులతో రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించుకున్నారు. వారికి ఆలయ మర్యాదలతో దక్షిణ గోపురం వద్ద ఆలయ ఇన్స్పెక్టర్ హరియాదవ్ సారధ్యంలో వేదపండితులతో స్వాగతం పలికారు. పూజల అనంతరం వారికి స్వామి అమ్మవార్ల అంతరాలయం దర్శనం ఏర్పాటు చేసారు. మృత్యుంజయ స్వామి ఆలయం వద్ద వారికి వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. ఎసి మల్లికార్జున్ ప్రసాద్ సారధ్యంలో ప్రోటోకాల్ మేరకు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

శివయ్య సేవలో ఉప లోకాయుక్త న్యాయమూర్తి

శ్రీకాళహస్తి,ఆగస్టు 8 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరుని సేవలో గురువారం రాష్ట్ర ఉపలోకాయుక్త జడ్జి పి.రజని కుటుంబ సభ్యులతోకలసి జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుని దర్శించుకున్నారు. వారికి దక్షిణ గోపురం వద్ద ఎసి మల్లికార్జున్ ప్రసాద్ సారధ్యంలో వేద పండితులతో స్వాగతం పలికారు. ఆలయంలోని స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం చేసుకున్న వారికి ఆలయ పిఆర్ఓ రవి,ఎపిఆర్ఓ శ్రీనాథ్‌లు ఏర్పాట్లు పర్యవేక్షించారు. న్యాయశాఖకు చెందిన జిల్లా అధికారులు స్వాగతం పలికారు.దర్శనం తరువాత వేదపండితులతో మృత్యుంజయ స్వామి ఆలయం వద్ద ప్రత్యేకాశీర్వచనాలు అందించారు.

బంగ్లాదేశ్ హిందువులపై దాడులను ఖండిస్తూ నిరసన

చిత్తూరురూరల్, ఆగస్టు 8 ప్రభాతవార్త: చిత్తూరుపట్టణం, గాంధీ విగ్రహం ఎదుట గురువారం సాయంత్రం పొరుగుదేశమైన బంగ్లాదేశ్‌లో జరుగుతున్న అల్లర్లు, దోపిడీలు, బతికుండగానే చంపేడం వంటి పరిణామాలను నిరసిస్తూ పీస్ ఫౌండేషన్ సభ్యులు రాజకీయాలకతీతంగా క్యాండిల్‌ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ లూటీలు, ఆస్తులను ధ్వంసం చేయడం లాంటి సంఘటనలు చూస్తుంటే ప్రజాస్వామ్య వ్యవస్థకు ముప్పు వాటిల్లినట్లేనని, సాక్షాత్తు దేశ ప్రధాని దేశాన్ని వదలి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేసారు. ముఖ్యంగా మైనారిటీ హిందువులు ఇతర కులాలవారు ఎంత దారుణంగా హింసించబడుతున్నారో తెలుస్తోందన్నారు. ఇలాంటి అరాచక శక్తులకు నిరసనగా బంగ్లాదేశ్‌లో చనిపోయిన వ్యక్తుల ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ క్యాండిల్ ర్యాలీ నిర్వహిస్తూ. భారత్‌మాతాకీ జై, వందేమాతరం, బంగ్లాదేశ్‌లో హిందువులకు రక్షణ కల్పించాలి, తీవ్రవాదం నశించాలని అంటూ నినాదాలు చేసారు. ఈ కార్యక్రమంలో బిజెపి చిట్టిబాబు, బ్రహ్మానందరెడ్డి, రామభద్ర, సునీల్, ఉదయ్, వెంకటేష్, పాండియన్, రెడ్డిమస్తాన్, ఆర్ఎస్ఎస్ రవీంద్రనాథ్, రఘు, బాలాజీ, రాధాక్రిష్ణ, మోహన్‌వినోద్, జనసేన పుష్పమ్మ, ఆర్యవైశ్య బద్రీ,సంపత్, పవన్‌కుమార్, చిన్నలు పాల్గొన్నారు.

చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని మొక్కులు

ఎంఎల్ఏ పులివర్తి నాని సాదర స్వాగతం

చంద్రగిరి, ఆగస్టు 8 ప్రభాతవార్త: తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాలని బెంగుళూరు చిక్కల్ సంద్ర అబ్బయ్య నాయుడు స్టూడియోలో స్థిరపడిన ఆంధ్రులు తిరుమల శ్రీవెంకటేశ్వరస్వామి వారికి మ్రొక్కుకున్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల ఫలితాలలో వీరి మ్రొక్కులు నెరవేరడంతో 58 మంది బెంగుళూరు నుండి కాలినడకన తిరుమలకు గత శుక్రవారం రోజున బయలుదేరారు. వీరంతా గురువారం సాయంత్రం మామండూరు వద్దకు చేరుకున్నారు. సమాచారం తెలుసుకున్న ఎంఎల్ఏ పులివర్తి నాని వీరిని కలసి సాదరంగా ఆహ్వానించారు. టిడిపి పట్ల, చంద్రబాబు పాలన పట్ల వీరికి గల అభిమానానికి ముగ్ధుడయ్యారు. వారితో కలసి ఫోటోలు దిగుతూ ప్రయాణ యోగక్షేమాలను అడిగితెలుసుకున్నారు. భారీ మెజారిటీతో టిడిపి కూటమి ఘనవిజయం సాధించడం పట్ల వారంతా హర్షం వ్యక్తం చేశారు. తిరుమల యాత్రలో వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు ఎంఎల్ఏ సంసిద్ధత వ్యక్తం చేస్తూ తనను ఫోన్ సంప్రదించాలని సూచించారు.

వసనాడు హైస్కూల్ ఎస్ఎంసి ఎన్నికల్లో ఉద్రిక్తత..

146 పాఠశాలల్లో ప్రశాంతంగా ఎన్నికలు.. మంకలదొడ్డిలో వాయిదా !!

కుప్పంరూరల్, ఆగస్టు 8 ప్రభాతవార్త : కుప్పం మండలంలోని వసనాడు జడ్పీ హైస్కూల్‌లో చేపట్టిన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికల సందర్భంగా ఉద్రిక్తత నెలకొంది. ఇక్కడ ఛైర్మన్ పదవి కోసం అధికార తెదేపా, వైకాపా నేతలు బల ప్రదర్శనలకు దిగారు. ఈ నేపథ్యంలో ఇరువర్గాల మధ్య చిన్నపాటి ఘర్షణ సైతం తలెత్తగా పోలీసులకు ఫిర్యాదులు అందాయి. అర్బన్ సిఐ జిటి నాయుడు గ్రామానికి చేరుకుని పరిస్థితి సమీక్షించి ఇరువర్గాల వారికి నచ్చజెప్పారు. ఇక్కడ ఎన్నికలు ఆగిపోయాయి. అలాగే మండలంలోని మంకలదొడ్డి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులు ఆశించిన మేర హాజరు కాకపోవడ ంతో ఎన్నికలు ఆగాయి. మండల ంలోని మిగతా 146 పాఠశాలల్లో ఎస్ఎంసి ఎన్నికలు ప్రశాంతంగా జరిగినట్లు ఎంఇఒ మహబూబ్ బాషా తెలిపారు. మిట్టపల్లి హైస్కూల్ ఛైర్మన్‌గా వెంకటేష్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో దేశం నేతలు చలపతి, లీలా వెంకటేష్ పాల్గొన్నారు. రాగిమానుమిట్ట ఉర్దూ స్కూల్ ఛైర్మన్‌గా జకా ఉల్లా, వైస్ ఛైర్మన్‌గా తస్లీమ్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో నేతలు శివకుమార్, రాజగోపాల్, అబ్దుల్ గఫార్, రిజ్వాన్, అక్మల్, ఇమ్రాన్, సద్దాం పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా ఎస్ఎంసి ఎన్నికలు

- ఎన్నికలను పరిశీలించిన డిఇఒ దేవరాజు

రామకుప్పం, ఆగస్టు 8 ప్రభాతవార్త : మండలంలోని 99 ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. డిఇఒ దేవరాజు ననియాల పాఠశాలలో ఎన్నికల సరళి పరిశీలించారు. స్కూల్ ఛైర్మన్‌గా గజేంద్రను ఎనుకున్నారు. రామకుప్పం జడ్పీ బాలికల హైస్కూల్ ఛైర్మన్‌గిఆ కేశవరెడ్డి, వైస్ ఛైర్మన్‌గా ఆనంద్, బాలుర హైస్కూల్ ఛైర్మన్‌గా శ్రీరాములు, వైస్ ఛైర్మన్‌గా లక్ష్మీనారాయణ, మోడల్ స్కూల్ ఛైర్మన్‌గా బాలసుబ్రమణ్యం, కెంపసముద్ర ం, ఐపగానిపల్లిలో శంకరప్ప,స్వప్నలు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు ఆనందరెడ్డి, యువత అధ్యక్షుడు విశ్వనాథ్, జనసేన హరీష్, బిజెపి నేత రాజసింహ, నేతలు సలాంసాబ్, రామకృష్ణప్ప, గంట్లరెడ్డి, కోదండరెడ్డి, వెంకటరమణ, శ్రీనాథ్‌రెడ్డి, మునిరెడ్డి, బాలరాజు, సుబ్రి, నయాజ్, మంజునాథ్, రమేష్‌రెడ్డి, పెరుమాళ్, మురళి పాల్గొన్నారు.

మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడుకు ఘన స్వాగతం

రేణిగుంట, ఆగస్టు 8 ప్రభాతవార